15



## పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే

■ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 5 జూన్ 2025 | ■ 15 పేజీలు


7లో



# పులులకు రాచబాట!




## కుమ్రంభీం టైగర్ రిజర్వు ఏర్పాటు

- ■ టైగర్ రిజర్వుగా ఆసిఫాబాద్ అడవులు..!
- ■ జిల్లా అటవీ విస్తీర్ణంలో మూడొంతులు కన్జర్వేషన్‌కే
- ■ 149288.88 చదరపు కి.మీ.లలో ఏర్పాటుకు చర్యలు
- ■ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో చర్యలు..
- ■ పులుల సంరక్షణ ప్రాంతంగా మార్పు
- ■ భవిష్యత్‌లో కొత్త టైగర్ జోన్ ఏర్పాటుకు అవకాశం
- ■ జీవో నెంబర్ 49 ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ■ పులుల పేరుతో ఆంక్షలపై స్థానికుల వ్యతిరేకత..
- ■ జీవో 49తో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం
- ■ మంత్రి సీతక్కకు మాజీ ఎంపీ సోయం వినతి
- ■ 'పోడు'తో సతమతమవుతున్న రైతులపై మరో పిడుగు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గడ్ నుంచి వచ్చే పులులకు ప్రధాన కారిడార్ ఉన్న ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లు 'టైగర్ కన్జర్వేషన్ రిజర్వు'గా మారనుంది. రాష్ట ప్రభుత్వం ఇటీవలే మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోనే పులుల రాకపోకలకు కీలకంగా ఉంది. దీంతో పులుల సంరక్షణకు వీలు కలుగనుంది. ఉమ్మడి జిల్లా పరిధి ఆసిఫాబాద్‌లో అధికంగా పులుల సంచారం పెరుగుతోంది. అయితే సంరక్షణ చర్యలు చేపట్టినా, పరిమిత అధికారులు మాత్రమే ఉండేది. తాజాగా టైగర్ రిజర్వుగా ఏర్పాటు చేయడంతో పులుల సంరక్షణకు మరిన్ని ప్రత్యేక కార్యకలాపాలు చేయాల్సి ఉంది. ఏదైనా ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్ రిజర్వుగా గుర్తించాలంటే ముందుగా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, కన్జర్వేషన్ రిజర్వుగా కొనసాగుతున్న వాటికే అనుమతి ఇస్తుంది. భవిష్యత్లో కేంద్రం నుంచి కొత్తగా టైగర్ రిజర్వుగా ఏర్పాటుకు అవకాశం కలుగనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా.. పెద్దపులులు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేదు. మహారాష్ట్రలోని తడోబా- అందేరి టైగర్ రిజర్వుల నుంచి కవ్వాల్‌కు పులులు వచ్చి పోతున్నాయి. మహారాష్ట్రాలోని తడోబా టైగర్ జోన్‌కు- కవ్వాల్ టైగర్‌జోన్‌కు మధ్య ఉన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులు కీలకంగా మారాయి. తడోబా నుంచి వలస వచ్చే పులులు కాగజ్‌నగర్-ఆసిఫాబాద్ డివిజన్‌లలోని అడవుల్లో స్థిరనివాసం ఏర్పర్చుకున్నాయి.

BIGSTORE

15



## సన్నబియ్యానికి సర్వర్ కష్టాలు

■ బయోమెట్రిక్ ప'రేషన్' ■ మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

■ ఆరుసార్లు వేలిముద్ర.. పంపిణీలో జాప్యం ■ మరో పక్క విజిలెన్స్ అధికారుల తనిఖీ

రేషన్ దుకాణాల పేరెత్తితో జనం విసిగిపోతున్నారు. సన్న బియ్యం కోసం గంటల తరబడి నిలబెడుతున్నారని మండిపడుతున్నారు. తెల్లవారగానే.. సంచులు పట్టుకుని బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొన్నదని భగ్గుమంటున్నారు. పనులు మానుకుని బియ్యం కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు వచ్చాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేందుకు అరగంట వరకు పట్టేదని, ఇప్పుడు గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తుందంటున్నారు. మరో పక్క ప్రత్యేక విజిలెన్స్ బృందాలు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీని తనిఖీ చేస్తూ లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు.

## ఏసీబీకి చిక్కిన సర్వేయర్ మంజుల

■ వివరాలు వెల్లడించిన ఏసీబీ అధికారి విజయ్ కుమార్

■ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్, చైన్‌మెన్..

భూమి సర్వే చేయడానికి ఓ రైతు వద్ద నుంచి లంచం తీసుకున్న మండల సర్వేయర్, చైన్‌మెన్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన మంచిర్యాల తహసీల్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది.

- వివరాలు 14లో





2

## వృద్ధుడిపై పోలీస్ జులుం

■ రైతును తోసేసిన పోలీస్ అధికారి..

■ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన రైతును భూభారతి సదస్సు నుంచి గెంటేసిన ఏఎస్సై

■ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఘటన..

■ దిద్దుబాటు చర్యలు చేపట్టిన అధికారులు

■ డీఐజీ ఆదేశాల మేరకు ఏఎస్సైని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ

భూమి సమస్యపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వృద్ధ రైతుపై ఓ పోలీసు కర్కశత్వం ప్రదర్శించాడు. గోడు వెళ్ల బోసుకుంటున్న అన్నదాతను మెడపట్టి బయటకు గెంటేశాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌లో బుధవారం జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసు అధికారి దౌర్జన్యానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో డీజీపీ ఆదేశాల మేరకు సదరు ఏఎస్సైని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు.



## మన భూమి.. మన భవిష్యత్

■ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి విఘాతం

■ ప్లాస్టిక్‌తో జీవగ్రహం అతలాకుతలం

■ నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ బదిలీ

■ నూతన ఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్

■ మెదక్ జిల్లా ఎస్పీగా డీవీ శ్రీనివాస్ రావు

■ ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణారావు







# వృద్ధుడిపై పోలీస్ జులుం

- రైతుపై చేయి చేసుకున్న ఏఎస్సై
- వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన రైతును భూభారతి సదస్సు నుంచి గెంటేసిన ఏఎస్సై
- నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో అమానవీయం
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన అధికారులు
- డీఐజీ ఆదేశాల మేరకు ఏఎస్సై సస్పెన్షన్..



**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
భూమి సమస్యపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన వృద్ధ రైతుపై ఓ పోలీసు కర్కశత్వం ప్రదర్శించాడు. గోడు వెళ్లబోసుకుంటున్న అన్నదాతను మెడపట్టి బయటకు గెంటేశాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో బుధవారం జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసు అధికారి దౌర్జన్యానికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రభుత్వ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.

బుధవారం ఖానాపూర్ తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో జరిగిన భూభారతి సదస్సుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అల్లెపు వెంకటి అనే వృద్ధరైతు తన భూమికి సంబంధించిన సమస్యపై ఫిర్యాదు చేసేందుకు సదస్సుకు వచ్చాడు. అధికారికి వినతపత్రాన్ని ఇస్తూనే ఆ గ్రామ మాజీ సర్పంచ్ చంద్రయ్యతో మాట్లాడేందుకు ఆయన ప్రయత్నించాడు. రైతు వెంకటి తీరుపై అసహనం వ్యక్తం చేసిన తహసీల్దార్.. ఆయనను బయటకు పంపాలంటూ అక్కడే ఉన్న ఏఎస్సై రాంచందర్‌ను ఆదేశించారు. సహనం కోల్పోయిన ఏఎస్సై రాంచందర్ వృద్ధుడని కూడా చూడ కుండా వెంకటిని బలవంతంగా బయటకు నెట్టుకొచ్చాడు. ఏఎస్సై తీరుతో అక్కడ ఉన్నవాళ్లంతా ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. గోడు చెప్పుకోవడానికి రావడమే తాను చేసిన తప్పా అంటూ వెంకటి కన్నీరు పెట్టుకున్నాడు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విమ ర్శలు వెల్లువెత్తడంతో దిగివచ్చిన ప్రభుత్వం పోలీస్ అధికా రిపై చర్యలకు ఆదేశించింది. కలెక్టర్ అభిలాష అభినవ్ సూచనల మేరకు ఎస్పీ జానకీషర్మిల బాసర జోన్ డీఐజీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఏఎస్సైని సస్పెండ్ చేస్తున్నట్టు డీఐజీ ప్రకటించారు.

## కట్టెతో ఒక్కటి వేద్దామనుకున్నా : ఏఎస్సై తీరుపై బాధిత రైతు ఆగ్రహం



నిర్మల్ జిల్లాలో ఎమ్మార్వో ఆఫీసులో తన భూమి సమస్య కోసం వెళ్లిన ఓ వృద్ధ రైతుపై ఏఎస్ఐ కనికరం లేకుండా వ్యవహరించిన సంగతి తెలిసిందే. భూ సమస్య గురించి ఎమ్మార్వోతో మాట్లాడుతుంటే రైతును ఏఎస్ఐ ఈడ్చుకెళ్లి బయటకు నెట్టేశాడు. ఈ ఘటనపై పోలీస్ శాఖ సీరియస్ అయ్యింది. ఇప్పటికే ఏఎస్ఐ రాంచందర్‌ను సస్పెండ్ చేశారు. కాగా ఈ ఘటనపై రైతు స్పందించారు. ఎమ్మార్వో ఆఫీసులో మాట్లాడుతున్న సమయంలో తనను పోలీస్ గుంజుకొని వెళ్లి బైట పడేశాడని చెప్పారు. తన వయసు 90ఏళ్లు అని ఇంత ఘోరంగా చేయడం అవసరమా అని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఏమీ చేయలేదని ఎమ్మార్వోతో మాట్లాడి వెనక్కి వస్తుంటే పోలీస్ తనను గట్టిగా పట్టుకుని లాగాడని అన్నారు. కట్టెపట్టుకుని ఒక్కటి వేద్దామని అనుకున్నానని కానీ అక్కడ ఉన్నవాళ్లంతా వద్దని అనడంతో ఆగిపోయానని చెప్పారు. తన భూమిలో నుండి అర ఎకరం భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నారని చెప్పారు. తనను ఆఫీసులో అధికారులు ఏం అనగలేదని కేవలం పోలీసులు మాత్రమే బయటకు పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రశాంత వాతావరణంలో రెవెన్యూ సదస్సులు : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. రైతుల భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం నుంచి మొదలైన భూభారతి రెవెన్యూ సదస్సులో ఇప్పటివరకు ఆయా మండలాలలోని 25 గ్రామాలలో ఇప్పటివరకు 1100 కు పైగా దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించడం జరిగిందని అన్నారు. రైతులపై ఎవరైనా దౌర్జన్యం చేసిన, దుసురుగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

## రైతు దురుసు ప్రవర్తనతోనే రైతును తోసేసిన ఏఎస్సై



ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ రెవెన్యూ సదస్సులో ఓ రైతు దురుసు ప్రవర్తనతోనే ఏఎస్ఐ ఆయనను పక్కకు జరిపారని గ్రామ కార్యదర్శి తెలిపారు. సదస్సు మూడో కౌంటర్‌లోకి వచ్చి అధికారులు, సిబ్బందితో దుర్భాషలాడుతూ దురుసుగా వ్యవహరించాడని పేర్కొన్నారు. అధికారుల ఆదేశాలతోనే ఏఎస్ఐ రైతును మర్యాదపూర్వకంగా పక్కకు జరిపినా అతనితో కూడా దురుసుగా వ్యవహరించి దుర్భాషలాడాడని పేర్కొన్నారు.

## రైతులపై దౌర్జన్యాలు పెరిగాయి : హరీశ్ రావు



రైతుపై పోలీసుల కర్కశత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రేవంత్ సర్కారుపై ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలోని చాలా చోట్ల రైతులపై పోలీసుల దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ఓపేద వృద్ధరైతు తన భూసమస్యను వివరించేందుకు అధికారుల వద్దకు వస్తే ఇలా వ్యవహరించడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. నాడు లగచర్ల, నేడు ఖానాపూర్‌లో రైతులను అవమానించారని మండిపడ్డారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

- అధికారులకు కలెక్టర్ సూచన
- ప్రజలు అధికారులు సహకరించాలి

గ్రామ రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారిన గ్రామ రెవెన్యూ సదస్సులకు సంబంధించిన వీడియో జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో రైతుపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సైని పోలీస్ శాఖ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే ప్రజలకు అధికారులంతా సహకారం అందించాలని సూచించారు. భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు రెండో దశలో భాగంగా ఈ నెల 03 నుంచి 20 వ తేదీ వరకు అన్ని మండలాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 36 రెవెన్యూ గ్రామాలలో 1000కి పైగా సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యల దరఖాస్తులను సమర్పించి, పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.



## రైతుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల
- పోలీసు సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించొద్దు..
- పోలీసు అధికారులతో ఎస్పీ అత్యవసర సమావేశం



జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది రైతులు ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సులో ఓ రైతు పట్ల ఏఎస్సై వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు రావడంతో పోలీసు అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు సమయంను పాటించాలన్నారు. రైతులు తమన సమస్యలను తెలిపేందుకు వస్తే వారి పట్ల మార్యదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి సమస్యలను ఓపికగా విని వారిని సంబంధిత అధికారి దగ్గరకు తీసుకెళ్తే పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందని, ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఖానాపూర్ ఘటనపై జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించారని ఈ మేరకు ఘటనకు సంబంధించిన నివేదికను మంత్రికి పంపినట్లు తెలిపారు. రైతు పట్ల దురుసుగా ప్రవర్తించిన ఏఎస్ఐ రామచంద్రన్‌ను ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతై శాఖపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిక్షణ కోసం కృషి చేస్తుందని, ప్రజలు రైతులు పోలీసులకు సహకరించాలని, అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని సూచించారు.

## అడవి బిడ్డలను జైలులో పెట్టిన ఘనత మీది..

- అన్నం పెట్టే రైతుల చేతులకు బేడీలు వేసి జైలుకు పంపింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కాద
- ప్రజా ప్రభుత్వంలో ఎవరూ తప్పు చేసిన శిక్ష పడాల్సిందే..
- మీరు తప్పు చేసిన, మీ మామ తప్పు చేసిన ప్రజా ప్రభుత్వంలో వదిలి పెట్టేది లేదు..
- మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో భూభారతి రైతు రెవెన్యూ సదస్సులో ఓ రైతు పట్ల ఏఎస్ఐ రాంచందర్ దురుసు ప్రవర్తనను తాము ఖండిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈ విషయమైన ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క కూడా స్పందించి సదరు పోలీసు అధికారిని సస్పెండ్ చేసి, ఘటనకు సంబంధించి పూర్తి నివేదికను ఇవ్వాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, దీంతో పోలీసులు రైతులపై కర్కశత్వాన్ని చూపెడుతున్నారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలు హాస్యస్పదమని, నోటిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మాజీ మంత్రి హరీశ్ రావుకు అలవాటుగా మారిందని వెడ్మ బొజ్జు పటేల్ ఘాటు విమర్శలు చేశారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం రైతులకు బేడీలు వేశారని, ఆదివాసీ బిడ్డలను చెట్లకు కట్టేసి కొట్టారని, గజ్వేల్‌లో బట్టలిప్పి కొట్టారని అవి మాజీ మంత్రికి గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. అప్పుడు రైతులపై పోలీసుల కర్కశత్వాన్ని ప్రదర్శిస్తే మాజీ మంత్రి నిద్రపోయారని అని ఎద్దేవా చేశారు. ఉమ్మడి జిల్లాలోని అడవి బిడ్డలను జైలులో పెట్టిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుదేనన్నారు. గర్భిణీలు, చంటి పిల్లలు ఉన్న తల్లులను కూడా జైలులో పెట్టారని అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదో మాజీ మంత్రి సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి అయ్యాక హరీశ్ రావుకు ప్రతీ విషయానికి సీఎం రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ నేతలపై బట్టకాల్చి మీదవేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో మీరు, మీ మామ తప్పు చేసిన వదిలి పెట్టమని, ఎవరు తప్పు చేసిన శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన అన్నారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఇప్పటికైన హరీశ్ రావు పనికిమాలిన విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.



# రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

## భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సుల్లో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**లోకేశ్వరం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నదే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని పొట్టపల్లి (బి), నర్సాపూర్ (జి) మండలంలోని బూరుగుపల్లి (కె) గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులు అందరూ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని తమ భూ సమస్యల వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. పొట్ట పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రత్యక్షంగా రైతులను కలసి వారి భూ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల వివరాలు పరిశీలించి అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. అనంతరం బూరుగుపల్లి (కె) గ్రామానికి వెళ్లిన కలెక్టర్ అక్కడ జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ, ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం పొందనున్నాయి తెలిపారు. జూన్ 3 నుండి 20వ తేదీ వరకు రెండో విడత భూ భారతి సదస్సులు జరుగనున్నాయన్నారు. సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత రిజిస్టర్లలో ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఇంతకుముందు కలెక్టర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన అన్నీ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్‌లు సర్పరాజ్, శ్రీకాంత్, అధికారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



### ఆసియా కప్ విజేత సుహాసిని

## అభినందించిన ఎస్పీ

**జైనూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

సిర్పూర్ (యు) మండలానికి చెందిన గేడం సుహాసిని, ఆసియా కప్ పోటీలో బంగారు పతకం సాధించి జిల్లాకు గొప్ప గౌరవం తీసుకువచ్చిందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం ఆమెను జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందిస్తూ, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన ఆసియా కప్ పోటీల్లో వివిధ దేశాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో పోటీ పడి, గిరిజన విద్యార్థినిగా సుహాసిని బంగారు పతకం గెలవడం ఎంతో గర్వకారణమని చెప్పారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అభిప్రాయపడ్డారు. సుహాసినిలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణ వల్లే ఈ స్థాయికి చేరిందని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, జిల్లాకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. తద్వారా గిరిజన బాలికలకూ ఆటలలో అవకాశాలు విస్తరిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు.



## ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనూష




**జన్నారం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

జన్నారం నూతన ఎస్ఐగా బుధవారం గొల్లపెల్లి అనూష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాలకు లోబడి నడు చుకోవాలన్నారు. మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా మండలంలో మత్తుపదార్థాలు, గంజాయి విక్రయం, రవాణాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీసు సిబ్బంది మండల ప్రజలు సహకరించాలని కోరారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

**తాండూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచిని గ్రామంలో బుధవారం ఫర్టిలైజర్, విత్తన దుకాణాల్లో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, బెల్లంపల్లి ఏడీఏ రాజనరేందర్ మాట్లాడారు. ఫర్టిలైజర్ దుకాణ యజమానులు రైతులకు నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదన్నారు. రైతులు నకిలీ పత్తి విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని సూచించారు. గుట్టుచప్పుడు కాకుండా పంట పొలాల్లో నకిలీ విత్తనాలు నాటినట్లు సమాచారం అందితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ రైతు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయానికి సంబంధించిన ఏ విత్తనాలు తీసుకున్న తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని



సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి రావడంతో పాటు లాభాలు కూడా వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుష్మ, తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, శిక్షణ ఎస్సై అనూష, సిబ్బంది పాల్గొన్నారు.



### దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ

## త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**భీమారం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా ఎంపికైన భీమారం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల తహశిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక తహశిల్దార్ జ్యోతి, రాంచందర్ తో కలిసి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, తిరస్కరించబడిన దరఖాస్తులకు సంబంధించి వివరాలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు అందుబాటులో వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని, పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలలో 325 కోట్ల రూపాయల జమ

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 28 వేల 642 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 95 వేల 554 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 325 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 325 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 2 వేల నుండి 4 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 90 లారీల ద్వారా 2 వేల నుండి 3 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 22 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు 10 నుండి 20 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

# ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- డిప్యూటీ బట్టి విక్రమార్క దత్తత గ్రామంలో ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కలెక్టర్ రాజర్షి షా
- అర్హులైన ప్రతీ ఒక్కరి ఇందిరమ్మ ఇండ్లు..
- టైలర్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత







**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులకు భూమిపూజ చేసిన తర్వాత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్ర మార్క ఎన్నికల సందర్భంగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రారంభించిన నేపథ్యంలో దత్తత తీసుకున్న బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామంలో ఇళ్ళ నిర్మాణానికి బుధవారం జిల్లా కలెక్టర్ భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను పరిశీలించి, రైతులు అందించే దరఖాస్తులపై ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద వారి సొంత ఇంటి కల సహకారం చేసేందుకు ఈ ఇండ్ల నిర్మాణం పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలన్న ద్రుడ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. భూమిపూజ చేసుకున్న తరువాత వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని, మధ్యలో పనులు ఆపకుండా నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. విడతల వారిగా డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు రానివారికి తప్పకుండా వస్తాయని ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ప్రోసిడింగ్ కాపీలు మంజూరు చేసి బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసిన అన్నిటికీ డబ్బులు వెంటనే ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆర్.యస్.ఈ.టి.ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా ఉమెన్స్ టైలర్ శిక్షణా పొందిన 35 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి, కిట్లు పంపిణి చేశారు. నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, మంచి బిజినెస్ ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మోహన్ సింగ్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, ఇండస్ట్రీ డీఎం పద్మ భూషణ్, ఉత్తం కుమార్, డైరెక్టర్ మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మారే దిశగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందాలు మరింత ప్రభావవంతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నియంత్రణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ చట్టాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రగతిరథం -ప్రజా చైతన్యం, ప్రచార రథయాత్ర వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలో నిత్యం నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 2న మాదకద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా స్థాపన కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గ్రామస్థాయిలోనూ స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, వయోవృద్ధుల హక్కులు, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక నిషేధం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, కళాకారులు సుదర్శన్, నాగరాజు, రఘునాథ్, లక్ష్మణ్, సుదర్శన్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



# 9న చలో నిర్మల్ విజయవంతం చేయండి

**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి నాయక పోడు తెగ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు సోమవారం చలో నిర్మల్ విజయవంతం చేయాలని నాయక పోడు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయక పోడు తెగకు సిరియల్ నంబర్ కేటాయించాలని, నిర్మల్ జిల్లాలో 55000 జనాభా ఉన్న గుర్తింపు లేకపోవడం పట్ల సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాలు దూరంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరేందుకే చలో నిర్మల్ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్మల్ జిల్లాలో ప్రధానమైన తెగ నాయక పోడు తెగ అధికారులకు తెలియకపోవడం తాము ఎంత వెనుకబడి ఉన్నామో ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అర్థం చేసుకోవాలన్నారు. తమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, జాతర, సంస్కృతిని సాంప్రదాయా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కుల దైవమైన భీమన్న ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, జాతర ఏర్పాటులకు నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మన ఆదివాసు బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసి అభ్యుదయ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా తుడుందెబ్బ కన్వీనర్ సాకి లక్ష్మణ్,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకుర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్ లింగన్న, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కస్తూర్ భూమేష్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మేడిపల్లి రవి, కొప్పుల చిన్నయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ప్రారంభం నాటికి

# మౌలిక వసతులు కల్పించాలి

## పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**నర్సాపూర్ (జి), జూన్ 4 (ప్రభాత సమాచారం)**

నర్సాపూర్ మండలంలో బూరుపల్లి గొల్లమాడ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. పాఠశాలకు వెల్లి అక్కడ ఉన్న తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగిపోయిన భవన నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మండల అధికారులు సిబ్బంది ఉన్నారు.



# ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలి




**తాండూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ బడులు నిలబడాలి, చదువుల్లో అంతరాలు పోవాలని తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రచార జాత రెండో విడతలో భాగంగా మంచిర్యాల జిల్లా తాండూర్ ఐబీ చౌరస్తాలో బుధవారం ప్రచారజాతా నిర్వహించారు. వారికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మంచిర్యాల జిల్లా కమిటీ స్వాగతం పలికింది. ఈ సందర్భంగా నర్సిరెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ చదువుల్లో మార్పు రావాలని కోరారు. ఉన్నోడి పిల్లలైనా, లేనోడి పిల్లలైనా ఒకే బడిలో, ఒకే కళాశాలలో, ఒకే యునివర్సిటీలో చదువుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ పౌర స్పందన వేదిక పనిచేస్తుందని వెల్లడించారు. అంతరాలు లేని చదువులకు అందరూ మాట్లాడాలని, కార్యాచరణలోకి రావాలని పిలుపునిచ్చారు. పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ, నాగమణి, ధనమూర్తి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, జిల్లా బాధ్యులు శివానంద్, రాజారాం పాల్గొన్నారు.

# సీఎంఆర్ పెండింగ్ రైస్ మిల్లులపై చర్యలు తీసుకోండి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
దీర్ఘకాలంగా సీఎంఆర్ ధాన్యాన్ని సమర్పించని రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి చెందే సీఎంఆర్ (కస్టమర్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని దీర్ఘకాలంగా సమర్పించని రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాంటి బకాయిదారులైన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కొంతమంది మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, వారి ఆస్తులను గుర్తించి బ్లాక్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంకా బకాయిలు ఉన్న మిల్లర్లను గుర్తించి, వారి ఆస్తులను బ్లాక్ చేయడంతో పాటు, బహిరంగ వేలం ద్వారా విక్రయించాల్సిందిగా సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి మిల్లర్లకు బ్యాంకులు ఎటువంటి రుణాలు మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే మండల స్థాయిలో విత్తనాల దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు, ఎరువుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి మ్యూజియంను ఏర్పాటు చేయాలి

**రామకృష్ణాపూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
కోల్ బెల్ట్ ఏరియాలో సింగరేణి చరిత్రకు సంబంధించిన సింగరేణి మ్యూజియంలను ఏర్పాటు చేయాలని క్యాతన్‌పల్లి మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర విద్యావంతుల ఐక్య వేదిక అధ్యక్షుడు గురజాల రవీందర్ రావు అన్నారు. బుధవారం రామకృష్ణాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఘనతను తెలిపేందుకు మ్యూజియం ఏర్పాటు కీలకం అని అన్నారు. సింగరేణి చరిత్రను భావితరాలకు తెలియజేయడం సులభంగా అర్థం అవుతుందని గురజాల రవీందర్ రావు అన్నారు. కొత్తగూడెం నుండి మొదలు బెల్లంపల్లి వరకు కనీసం మూడు సింగరేణి మ్యూజియంలు ఏర్పాటు చేసేలా అధికారులు కృషి చేయాలని కోరారు. అలాగే ఓ మొబైల్ మ్యూజియంను ఏర్పాటు చేయడం వల్ల సింగరేణి ఘనతను, అప్పటి ట్రేడ్ యూనియన్ల నాయకత్వాన్ని, కార్మికుల పనితీరును ఊరరా తెలియజేయడం చాలా సులభతరం అవుతుందన్నారు. సీఅండ్ఎండి బలరాం నాయక్‌ను కలిసి సింగరేణి మ్యూజియం ఏర్పాటు చేసేలా మెమరండం అందజేస్తామన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి



**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని సీఐటీయు నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సురేష్ కోరారు. గురువారం ఖానాపూర్ మండలంలోని సూర్జపూర్ గ్రామంలో పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. 9 నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## అనారోగ్యంతో ఎస్ఐ మృతి

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ శివాజీ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శివాజీ మృతదేహానికి పూలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రూ. 30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలి




**మందమర్రి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలని పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. బుధవారం తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రచార జాతాలో భాగంగా కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. బడీఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలన్ని రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. ధార్మిక సంస్థలు ఏర్పాటు చేసిన ఎయిడెడ్ పాఠశాలల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పౌర స్పందన వేదిక నాయకులు మంగ, నాగమణి, ధనమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజకమలాకర్ రెడ్డి, నాయకులు మహేష్, సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆనంద్ కుమార్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం పెనుముప్పు



**ముథోల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
వ్యాపారస్తులు పర్యావరణానికి హాని కలిగించి ప్లాస్టిక్‌ను వాడవద్దని పంచాయతీ కార్యదర్శి అన్వర్ ఆలీ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ముథోల్‌లో వ్యాపారస్తులకు ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని నోటీసులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో భవిష్యత్ తరాలకు పెనుముప్పు ఏర్పడనుందన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై వివరించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని వెల్లడించారు.

## డివైఎస్ఓగా శ్రీనివాస్

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా జక్కుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రస్తుత డివైఎస్ఓగా పనిచేసిన వెంకటేశ్వర్లు పదవి విరమణ చెందడంతో ఆయన స్థానంలో సీనియర్ పి.డి జక్కుల శ్రీనివాస్ ని డివైఎస్ఓగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా నూతన డి.వై.ఎస్.ఓను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, డి.ఎస్.ఏ సిబ్బంది కలిసి పుష్పగుచ్చని అందించి శుభాకాంక్షలు తెలిపారు.





## పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా దానపెల్లి తిరుపతి

**మందమర్రి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా దానపెల్లి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎన్నికల కోసం నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగిసింది. అధ్యక్ష స్థానానికి అడిచెర్ల నాగేందర్, బత్తుల శ్రీనివాస్, బత్తుల సతీష్ బాబులు, ప్రధాన కార్యదర్శి పదవికి దానపెల్లి తిరుపతిలు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతుండగా, ప్రధాన కార్యదర్శి పదవికి నామినేషన్ వేసిన తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సంఘం అడహాక్ కమిటీ సభ్యుడు పుట్ట సదానందం తెలిపారు. ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నికైన దానపెల్లి తిరుపతికి సంఘం ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేశారు. పోటీలో ఉన్న అధ్యక్ష అభ్యర్థులు జూన్ 13 లోపు వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో ప్రచారం ముగించాలని, జూన్ 15న ఎన్నికలు పద్మశాలి సంఘం కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని అడహాక్ కమిటీ సభ్యుడు సదానందం తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా కులబాంధవులు సహకరించాలని కోరారు. కుల బాంధావుల ప్రోత్సాహంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా తిరుపతి అన్నారు.

## స్పీకర్ ప్రసాద్‌ను కలిసిన నాతరి స్వామి

**బెల్లంపల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బెల్లంపల్లి నివాసి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి హైదరాబాదుకి వెళ్లి స్పీకర్ ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి



**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
అదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మలో రైతులకు తక్కువ యూరియా వాడడం అవసరం మేరకు రసాయన మందులు, సాగు నీటి వాడకం పంట మార్పిడి పర్యావరణ పరిరక్షణ పట్ల శాస్త్రవేత్తలు అవగాహన కలిపించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి. రాంప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు సేంద్రీ య ఎరువులు వాడి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు.




# బడిబాటను విజయవంతం చేయాలి

## జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్





**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి తలపెట్టిన ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎ.టి.డి.ఓ. పురుషోత్తంతో కలిసి వసతిగృహాల సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమ విజయవంతానికి అందరం కలిసి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలు, 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యచరణ చేపట్టాలని, స్వయం సహాయక సంఘాలు, ఎ.ఎ.పి.సి. సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు, పాత విద్యార్థుల భాగస్వామ్యంతో మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పించాలని, ప్రతిజ్ఞ, బడిబాట ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 7వ తేదీన ఇంటింటిని సందర్శించి బడి వయస్సు పిల్లలను నమోదు చేయాలని, జాబితా తయారు చేయాలని తెలిపారు. 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరించాలని, భవిత కేంద్రాలకు పిల్లలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి ఉట్నూర్ లోని కొమురంభీం కాంప్లెక్స్ లోని వికాసం ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. 11వ తేదీన 10వ తేదీ వరకు జరిగిన కార్యక్రమ పురోగతిపై చర్చించి, 12వ తేదీ నుండి కార్యచరణ ప్రకారంగా రోజువారి కార్యక్రమాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన పాఠశాలల పున:ప్రారంభించబడి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని, బడిబాట కార్యక్రమం ఆవశ్యకత తెలిసేలా పండగ వాతావరణంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేయాలని, తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, ఏక రూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యా సంబంధిత అంశాలు, క్రీడలు, సాం స్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ వాహనాలకు పోలీస్ సైరన్ పెడితే చర్యలు

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రైవేట్ వాహనాలకు పోలీసు సైరన్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా అధిక శబ్దం వచ్చేలా వాహన మోడీఫైడ్ హారన్ ఉండరాదన్నారు. పట్టణంలో ఒక వాహనం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చీటింగ్ కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

**కుభీర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండలంలోని పల్సి గ్రామంలో బుధవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా దేవతామూర్తుల ప్రతిష్టా పన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాలక్ష్మి, పోచమ్మ, ముత్యాలమ్మలను గణపతి గౌరీ పూజ కార్యక్రమం తో పు రోహితుల మంత్రోచ్చారణ ప్రాణప్రాతిష్ట, హెూమం, వివిధ కార్యక్రమాలను చేశారు. గ్రామంలో బ్యాండ్ వాయిద్యాలు డప్పుచప్పుళ్లు, బోనాలు మంగళహారతులు, పూనకాలతో శోభాయాత్ర జరిగింది. గ్రామంలో ఎటు చూసినా పండగ వాతావరణం నెలకొంది.

# భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

**జైనూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. బుధవారం జిల్లాలోని లింగాపూర్ మండలం గమ్నూరు గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి హాజరై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు తమ భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు సమర్పించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సరస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, పేరు సవరణ, విస్తీర్ణ సవరణ, మిస్సింగ్ సర్వే నెంబర్, నిషేధిత జాబితాలో నమోదైన భూములు వంటి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. సిర్పూర్ (యు) మండలం భూర్నర్ (బి) గ్రామంలో, జైనూర్ మండలం పవార్‌గూడ గ్రామంలో చేసిన రెవెన్యూ సదస్సులను సందర్శించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ప్రహ్లాద్, భీమ్ రావ్, పెద్దిరాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అమ్మ ఆదర్శ కమిటీలు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించడం జరిగిందని, పాఠశాల విద్యార్థులతో కళకళలాడేలా, విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా త్వరలో చేపట్టబోయే బడిబాట కార్యక్రమంలో కూడా విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా సమష్టిగా కృషి చేయాలని సూచించారు.



## టెన్త్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

### విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ విభాగంలో జిల్లాలోని జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.సి. ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రాథోడ్ యోగేశ్వర్ (582), ఏల్పుల నరేందర్ (570), కొత్త అనిల్ (560)లు మంచి మార్కులు సాధించారని, జాతీయ స్థాయిలో ఎన్.ఎంఎం.ఎస్. ఫలితాలలో జిల్లాలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయ బృందం కృషి ఎంతో ఉందని అన్నారు. మేధ చారిటబుల్ ట్రస్ట్ – హైదరాబాద్ అందిస్తున్న మేధా సంపూర్ణ శిక్షలో భాగంగా 5 సంవత్సరాలకు గాను ఇంటర్మీడియట్ కార్పొరేట్ విద్య, ఎం.బి.బి.ఎస్./ఐ.ఐ.టి. తదితర డిగ్రీ కోర్సులలో ఉచిత విద్యకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం, సి.ఓ. ఈ. గౌలిదొడ్డికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, చౌదరి, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది దాముక కమలాకర్, గోవర్ధన్, రాజన్న బుచ్చి లింగయ్య, ప్రకాష్, కాంతయ్య పాల్గొన్నారు.

# పథకాల అమలుకు ఆన్‌లైన్ డాటా కీలకం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**




వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న డాటా ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. డిఎంహెచ్ఓ కార్యాలయ సమావేశం మందిరంలో లెప్రసీ విభాగానికి సం బంధించిన నికుష్ట్ పోర్టల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల డాటా నమోదు చేయడంపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, లెప్రసీ నోడల్ పర్సన్‌లకు లెప్రా ఇండియా రాష్ట్ర ప్రాజెక్టు అధికారి కామేశ్వర రావు, రాష్ట్ర శిక్షణ ప్రతినిధి నరసింహస్వామి, శిక్షణను ఇచ్చారు. బుధవారం ఈ శిక్షణను ప్రారంభించిన అనంతరం డి.ఎం.అండ్.హెచ్.ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల వివరాలు నిర్దేశిత సమయంలో ఆన్‌లైన్‌లో పొం దుపరచాలని సిబ్బందికి సూచించారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన గణాంకాల ఆధారంగానే రాష్ట్రస్థాయిలో పథకాలను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. తద్వారా రోగులకు మెరుగైన సేవలు అందే అవకాశం లభిస్తుందన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలను సకాలంలో ప్రతి నెల ఆన్‌లైన్ పోర్టల్లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్ రావు, రమేష్, ఆయా పీహెచ్సీల నోడల్ పర్సన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.




# పులులకు రాచబాట!

**■ కారిడార్ ఇక కన్జర్వేషన్ ■ టైగర్ రిజర్వుగా ఆసిఫాబాద్ అడవులు ■ అటవీ విస్తీర్ణంలో మూడొంతులు టైగర్ కన్జర్వేషన్ రిజర్వుకే కేటాయింపు ■ 149288.88 చదరపు కి.మీ.లలో ఏర్పాటుకు చర్యలు ■ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లో చర్యలు ■ పులుల సంరక్షణ ప్రాంతంగా మార్పు ■ భవిష్యత్‌లో కొత్త టైగర్ జోన్‌కు అవకాశం ■ జీవో నెంబర్ 49 రిలీజ్ చేసిన ప్రభుత్వం ■ పులుల పేరుతో ఆంక్షలపై స్థానికుల వ్యతిరేకత ■ జీవో 49తో ఆదివాసీలకు అన్యాయం ■ మంత్రి సీతక్కకు సోయం వినతి ■ టైగర్ జోన్‌ను ఉపసంహరించుకోవాలి : ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్గఢ్ నుంచి వచ్చే పులులకు ప్రధాన కారి డార్ ఉన్న ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లు 'టైగర్ కన్జర్వేషన్ రిజర్వు'గా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధి లోనే పులుల రాకపోకలకు కీలకంగా ఉంది. దీంతో పులుల సం ˆక్షణకు వీలు కలుగనుంది. ఉమ్మడి జిల్లా పరిధి ఆసిఫాబాద్‌లో అధి కంగా పులుల సంచారం పెరుగుతోంది. అయితే సంరక్షణ చర్యలు చేపట్టినా, పరిమిత అధికారులు మాత్రమే ఉండేది. తాజాగా టైగర్ రిజర్వుగా ఏర్పాటు చేయడంతో పులుల సంరక్షణకు మరిన్ని ప్రత్యేక కార్యకలాపాలు చేయాల్సి ఉంది. ఏదైనా ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్ రిజర్వుగా గుర్తించాలంటే ముందుగా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, కన్జర్వేషన్ రిజర్వుగా కొనసాగుతున్న వాటికే అనుమతి ఇస్తుంది. భవిష్యత్లో కేంద్రం నుంచి కొత్తగా టైగర్ రిజర్వుగా ఏర్పాటుకు అవకాశం కలుగనుంది.

కాగజ్‌నగర్ డివిజన్ నుంచి బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, జన్నారం వరకు పులుల సంచారం ఉంటోంది. మొదట అధికారులు జన్నారం కోర్ ప్రాంతంగా టైగర్ రిజర్వు ఏర్పాటు చేశారు. అక్కడి పరిస్థితులు పులుల ఆవాసానికి అనుకూలంగా లేకపోవడంతో చుట్టపు చూపులా వచ్చి వెళ్తూ.. నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. మరోవైపు ప్రాణహిత, పెద్దవాగు, గోదావరి తీరాల్లో కాగజ్‌నగర్ నుంచి చెన్నూరు, బెల్లంపల్లి డివిజన్ల వరకు పులుల సంచారం పెరు గుతోంది. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లో కాగజ్‌నగర్, పెంచిక ల్‌పేట్, బెజ్జూరు, దహెగాం, పరిధిలో నివాసాలు ఉన్నాయి. ఇక వేమనపల్లి, చెన్నూరు, కోటపల్లి పరిసరాల్లోనూ సంచారం ఉంది. కోర్ ప్రాంతంగా ఉన్న కవ్వాల్ వరకు వెళ్లకపోగా ఇక్కడే స్థిర నివాసం ఎక్కువగా ఏర్పర్చుకుంటున్నాయి. పాల్గుణ అనే ఆడపులి సంతతితో పాటు కే, ఎస్,పీ, ఏసిరీస్ పేర్లతో ఉన్న పులులన్నీ ఇక్కడి పరిధి లోనివే. పులులు జతకట్టి సంతానాన్ని వృద్ధి చేసుకుంటున్నాయి. వేట, మానవ కార్యకలాపాలతో జంతువులకు ముప్పు పొంచి ఉంది.

**రక్షణకు పకడ్బందీగా చర్యలు...**

ఉమ్మడి జిల్లా విస్తరించిన కవ్వాల్ అభయారణ్యంలో బఫర్ ఏరియాలో ఉన్న ఆసిఫాబాద్ జిల్లా ఉంది. 1.40లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణంతో ఉన్న రెండు డివిజన్లలో ఈ టైగర్ కన్జర్వేషన్‌గా మార్చడంతో మరిన్ని ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. పులులు సంచరించే ప్రాంతాల్లో మానవ కార్యకలాపాలు పూర్తిగా తగ్గించడంతోపాటు పలు నిషేధిత ఆజ్ఞలు అమలులో ఉండనున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ ఉల్లంఘ నలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వేటాడడం, విద్యుత్ కంచెలు అమర్చడం, వన్య ప్రాణులకు హాని తలపెట్టే వీలు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది. ఆసిఫాబాద్ జిల్లా అడవులు.. ఇక టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా మారనుండగా, ప్రాధాన్యం సంతరించుకున్నది. 244540 హెక్టార్లలో అడవులుండగా, ఇందులో 149288.88 హెక్టార్ల(మూడోవంతు)ను టైగర్‌జోన్‌గా మార్చేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది.

**పులుల సంరక్షణ ప్రాంతంగా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా.. పెద్దపులులు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేదు. మహారాష్ట్రలోని తడోబా- అందేరి టైగర్ రిజర్వుల నుంచి కవ్వాల్‌కు పులులు వచ్చి పోతున్నాయి. మహారాష్ట్రాలోని తడోబా టైగర్ జోన్‌కు- కవ్వాల్ టైగర్‌జోన్‌కు మధ్య ఉన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులు కీలకంగా మారాయి. తడోబా నుంచి వలస వచ్చే పులులు కాగజ్‌నగర్-ఆసిఫాబాద్ డివిజన్‌లలోని అడవుల్లో స్థిరనివాసం ఏర్పర్చుకున్నాయి.

యేటా పదుల సంఖ్యలో పులులు తడోబా- అందేరి టైగర్ రిజర్వుల నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని పులుల సంరక్షణ ప్రాంతంగా గుర్తించాలని అటవీశాఖ 2024లోనే ప్రతిపాదనలు చేసింది. రెండేళ్లుగా పులుల సంచారం పెరగడం.. నిత్యం వేటగాళ్ల బారినపడి పడుతుండడంతో అటవీ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నది. మహారాష్ట్రాలోని తడోబా-అందేరి టైగర్ రిజర్వులతో కవ్వాల్ టైగర్ రిజర్వును అనుసంధానం చేసే కుమ్రం భీం టైగర్ రిజర్వు కన్జర్వేషన్ ప్రాంతంకీలకంగా మారనున్నది.

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ వైల్డ్‌లైఫ్ అభయారణ్యం, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వులతో కలిపే ముఖ్యమైన కారిడార్ కానున్నది. పెద్దపులుల సంరక్షణ, ఆవాసానికి అనువైన ప్రాంతంగా ఉన్న కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ డివిజన్‌లలో పులులతో పాటు చిరుతపులులు, అనేక రకాల వన్య ప్రాణులు ఉన్నాయి. జిల్లాలో సుమారు గత పదేళ్లుగా పెరుగుతున్న పులుల కారణంగా వేటగాళ్ల దా డులు కూడా పులులపై అధికమయ్యాయి. గ తంతో రెండు పులులపై విషప్రయోగం చేసిన వేటగాళ్లు ఇటీవల ఒక పులిని విద్యుత్ షాక్‌తో హతమార్చారు. పులుల సంరక్షణ కోసం కీలకమైన నిర్ణయాలు తీసుకున్న అటవీ శాఖ.. జిల్లా అడవుల్లో పులులు ఎక్కువగా సంచరించే 1492.88 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని కుమ్రం భీం టైగర్ రిజర్వు కన్జర్వేషన్ ప్రాంతంగా మార్చింది.

**స్థానికుల వ్యతిరేకత...**

జిల్లాలో మూడొంతుల అడవిని టైగర్ రిజర్వు కన్జర్వేషన్ ప్రాంతంగా మార్చడంతో పోడు సాగు చేసుకుంటున్న రైతులు తమ భూములను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. అటవీ శాఖ ఏర్పాటు చేసిన టైగర్ రిజర్వు కన్జర్వేషన్ ప్రాంతంలో పెంచికల్‌పేట్, బెజ్జూర్, కర్జెల్లి, సిర్పూర్, కాగజ్‌నగర్, తిర్యాణితో పాటు ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన రేంజ్ పరిధిలోని



అటవీ ప్రాంతాలు కీలకంగా ఉన్నాయి. ఈప్రాంతాల్లోనే గిరిజన రైతులతో పాటు గిరిజనేతరులు కూడా తరతరాలుగా పోడు చేసుకుంటున్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పొందిన ఈ భూముల్లో సాగు చేసుకునేందుకు అటవీ అధికారులు అనేక ఆంక్షలు విధిస్తూ వచ్చారు.

**టైగర్ రిజర్వు ఏర్పాటు హరణీయం పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ**

తెలంగాణ రాష్ట్రంలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ రిజర్వు ఏర్పాటుకు ప్రభుత్వం అను మతించడం హర్షణీయమైన విషయమని రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి డాక్టర్ సువర్ణ అన్నారు. టైగర్ రిజర్వు ఏర్పాటును ప్రకటిస్తూ గత శుక్రవారం అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం ఆమె జిల్లా పర్యటించారు. డీఎఫ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు జిల్లాలో టైగర్ రిజర్వు ఏర్పాటు ప్రతిపాదన పదేళ్ల నుంచి ఉందని. దీని గురించి ఆ ప్రాంతా ప్రజలతో సంప్రదింపులు చేపట్టినా తర్వాతనే ఓకే చేశారని తెలిపారు. టైగర్ రిజర్వు పరిధిలో సుమారు 339 వరకు గ్రామాలు వస్తాయని.. టైగర్ రిజర్వు ఏర్పాటుతో ఆ గ్రామాల ప్రజలకు లాభం తప్ప.. ఎలాంటి నష్టం కలగదని చెప్పారు. టైగర్ రిజర్వు ఏర్పాటుకు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆ ప్రాంత అభివృ ద్ధికి ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. అవగాహన లేక కొందరు కావాలనే టైటిల్ రిజర్వు ఏర్పాటుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె చెప్పుకొచ్చారు.

**టైగర్ జోన్ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి : ఎమ్మెల్యే కోవలక్ష్మి**

జిల్లాలోని ఆదివాసీల భూములను లాక్కునే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెరమీదకు తీసుకువస్తున్న కాగజ్‌నగర్ టైగర్‌జోన్ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో ప్రభుత్వం భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. టైగర్ జోన్ ఏర్పడితే ఆదివాసీల జీవితాలు ఛిద్రమవుతాయని తెలిపారు. ఆదివాసీ గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు తాను అండగా ఉంటానన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**చెన్నూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండలం బుద్దారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను మండల తహశిల్దార్ మల్లిఖార్జున్‌తో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ. ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించి దాదాపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని భీమారం మినహా అన్ని మండలాలలో కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న వంటశాల నిర్మాణ పనులు పరిశీలించి వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా



పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని, అమృత్ 2.0 ద్వారా తాగునీటిని అందించేందుకు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### చౌక ధరల దుకాణాల్లో
# విజిలెన్స్ తనిఖీలు

## సన్నబియ్యంపై సివిల్ సప్లై ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి ఆరా

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
మూడు నెలల రేషన్ కోటాను కార్డు దారులకు ఒకేసారి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై సివిల్ సప్లై రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ విభాగం ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించారు. జిల్లా కేంద్రంతో పాటు జైనథ్ మండలంలోని పలురేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి సన్నబియ్యం నాణ్యత, వినియోగంపై ఆరా తీశారు. తూకంలో ఏమైనా తేడాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాణ్యత పరిశీలన కోసం బియ్యం శాంపిల్స్ సేకరించారు. కాగా, తమ వద్ద మిగిలిన దొడ్డుబియ్యం కారణంగా సన్నబియ్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని డీలర్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఒకే కార్డుదారు ఆరుసార్లు వేలి ముద్ర వేయాల్సి రావడంతో పంపిణీలో ఆలస్యం అవుతుందని వివరించారు. ఆయన వెంట డీఎస్‌వో వాజీద్ అలీ, సుధారాణీ, డీటీ రాథోడ్ బాబుసింగ్ ఉన్నారు.

# రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం





**జైపూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వ హిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం మిట్టపల్లి, నర్సింగాపూర్ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను మండల తహశిల్దార్ వనజారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణలతో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధిం చిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించి దాదాపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని భీమారం మినహా అన్ని మండలాలలో కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

**ఇంద్రవెల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై అప్ర మత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో గర్భిణులను, దీర్ఘకాలిక రోగులను గుర్తించి ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి బర్త్ వేటింగ్ రూంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, పూజిత, నిలోఫర్, హెల్త్ సూపర్వైజర్ సురేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**బెజ్జూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండల కేంద్రంలో సీఎం సహాయ నిధిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ బుధవారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. బెజ్జూరు మండలానికి చెందిన కామెర నిమ్మబై, సులుగుపల్లి గ్రామానికి చెందిన అంకుబాయి, బెజ్జూర్కు చెందిన కోర్ట శ్రీశైలం శ్రీశైలంకు సీఎం సహాయ నిధి కింద రూ. 58 000 రూపాయలు మంజూరయ్యాయి. ప్రభుత్వం మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్సీ దండే విఠల్ అందజేశారు. సీఎం సహాయ నిధులు సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గణపతి, బెజ్జూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, బెజ్జూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు కొడుప విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
మావల మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు బుధవారం ఎంపిడివో శంకర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ఎంబడి గంగా భవాని కి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సొంతింటి కల సాకారం అవుతున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేసారు. తెలిపారు. ఎన్నికల వ్పుడు ఇచ్చిన హామీలన్నింటిని నేరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

# మరమ్మత్తుల నేపథ్యంలో తాత్కాలికంగా పలు రైళ్ల రద్దు

**బెల్లంపల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
కాజీపేట్ సబ్ డివిజన్ పరిధి బెల్లంపల్లి–రేచ్నీరోడ్ రైల్వేస్టేషన్ సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్ని రైళ్ల హాల్టింగ్ ను తాత్కాలికంగా రైల్వేశాఖ ఎత్తివేసింది. రద్దు, హాల్టింగ్ ఎత్తివేత ప్రక్రియ ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమలులో ఉంటుంది. కాజీపేట్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ప్యాసింజర్, కాజీపేట్, సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, భద్రాచలంరోడ్ – బల్లార్షా రైళ్లు రద్దు కాగా సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్ ప్రెస్, హైదరాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను



మంచిర్యాల వరకు నడుపనున్నారు. మైసూర్ – జైపూర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ –న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ –దానాపూర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి –హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కా లికంగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్ హాల్టింగ్ ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాజిపేట్ – బల్లార్షా మధ్య.. కాజీపేట్ – బల్లార్షా మధ్య పలు రైళ్లను ఈ నెల 20 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ సీవోఎం కె. మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ –సిర్పూర్, కాజిపేట్ – సిర్పూర్, సికింద్రాబాద్– కాగజ్‌నగర్, కరీంనగర్ –బోధన్, గోరఖ్పూర్–త్రివేంద్రంతో పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, రేచినిరోడ్ మధ్యలో థర్డ్ లైన్ పనులు జరుగుతున్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



సూపర్ స్టార్ రజనీకాంత్- లోకేష్ కనగరాజ్ కాంబోలో రాబోతున్న 'కూలీ' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా ఓవర్సీస్ థియేట్రికల్ రైట్స్ భారీ ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 80 కోట్లకు పైగా డీల్స్ వస్తున్నాయని సినీ వర్గాల్లో టాక్. ఇదే నిజమైతే.. తమిళ సినిమా చరిత్రలో 'కూలీ' సరికొత్త బెంచ్ మార్క్ సృష్టిస్తుంది. ఇప్పటివరకు ఓవర్సీస్ లో అతిపెద్ద ప్రీ-రిలీజ్ బిజినెస్ చేసిన సినిమాగా నిలవనుంది. తెలుగులో కూడా భారీ హైప్ ఇదిలా ఉంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా రజనీ సినిమాలకు మంచి డిమాండ్ ఉంటుంది. గతంలో 'జైలర్', 'లియో'చిత్రాలు మంచి వసూళ్లు సాధించాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూషన్ హక్కులకు ₹50-60 కోట్ల వరకు ఆఫర్లు వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకుల అభిప్రాయం. అంతేకాదు టాలీవుడ్ హీరో నాగార్జున కూడా ఈ సినిమాలో ఉండడంతో ప్రేక్షకులను దృష్టిని మరింత ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నారు.బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 350 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి విడుదలైన ప్రచార చిత్రాలతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇందులో రజనీ, నాగార్జున తో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర, మలయాళ నటుడు సౌబిన్ షాహిర్, తమిళ వెటరన్ సత్యరాజ్, శ్రుతి హాసన్, రేబా మోనికా జాన్, జూనియర్ ఎం.జి.ఆర్, మోనిషా బ్లెస్సీ వంటి స్టార్ తారాగణం కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## రూ. 80 కోట్ల ఓవర్సీస్ డీల్‌తో.. రజనీకాంత్ కూలీ



## వర్షపు నీటి జల్లుల్లో బాలీవుడ్ బ్యూటీ అందాల ఆరబోత..

బాలీవుడ్ బ్యూటీ నుష్రత్ నెట్టింట గ్లామరస్ ఫొటో షూట్ షేర్ చేసింది. వర్షపు జల్లుల్లో ఈ ముద్దుగుమ్మ అందాలు కుర్రాళ్ళ హార్ట్ బీట్ పెంచేస్తున్నాయి. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ కనిపించే నుష్రత్ తరచూ గ్లామరస్ ఫొటో షూట్ తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ వర్షం ఎఫెక్ట్ తో షేర్ చేసిన ఫొటో షూట్ నెట్టింట వైరల్ అవుతోంది. వర్షపు జల్లుల్లో ఈ ముద్దుగుమ్మ అందాలు కుర్రాళ్ళ హార్ట్ బీట్ పెంచేస్తున్నాయి. ఈ ఫొటోలు చూసిన వారంతా వావ్, సూపర్ అంటూ ఫైర్ ఈమోజీస్ తో కామెంట్లు పెడుతున్నారు. నుష్రత్ 'లవ్ సెక్స్ ఔర్ ధోకా'', 'ప్యార్ కా పంచ్‌నామా' చిత్రాలతో మంచు గుర్తింపు తెచ్చుకుంది. 'సోను కే టిటు కి స్వీటీ' చిత్రం నుష్రత్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ ముద్దుగుమ్మ గురించి మరో ఇంట్రెస్టింగ్ విషయం ఒకటి ఉంది. సూపర్ హిట్ మూవీ 'స్లమ్‌డాగ్ మిలియనీర్' కోసం నుష్రత్ ఆడిషన్ ఇవ్వగా.. ఆమె మురికివాడల్లోని అమ్మాయిలా కనిపించడం లేదని రిజెక్ట్ చేశారట. నుష్రత్ ప్రస్తుతం 'చోరీ 2' , ఇతర ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. నుష్రత్ ముంబైలోని ఒక దావూది బోహ్రా కుటుంబంలో 1985 మే 17న జన్మించారు.

**MOVIE TIME**
గురువారం | 5 జూన్ | 2025



డీజీ టిల్లు' సినిమాతో యూత్ లో ఫుల్ ఫాలోయింగ్ తెచ్చుకున్న స్టార్ బాయ్ హీరో సిద్ధూ .. ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. అయితే సిద్ధూ ఇటీవలే నటించిన 'జాక్' మాత్రం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేపోయింది. దీంతో నిర్మాతలకు కూడా భారీ నష్టం చేకూరుంది. ఈ మేరకు ఓ గొప్ప నిర్ణయాన్ని తీసుకున్నారు సిద్ధూ. తన రెమ్యునరేషన్ లో సగం పారితోషకాన్ని తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించున్నాడు. ఈ సినిమా కోసం సిద్ధూ రూ. 8కోట్ల రెమ్యునరేషన్ తీసుకోగా.. అందులో నుంచి రూ. 4కోట్లు తిరిగి ఇచ్చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన నెటిజన్లు సిద్ధూ గొప్ప మనసుపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధూ - వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద రూ. 10 కోట్లు కూడా కలెక్ట్ చేయలేకపోయినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. ఇది ఇలా ఉంటే ప్రజెంట్ సిద్ధూ లేడీ డైరెక్టర్ నీరజకోన దర్శకత్వంలో 'తెలుసు కదా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఇందులో సిద్ధూ జోడీగా కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథనాయికలుగా నటిస్తున్నారు. ఇటీవలే మూవీ విడుదల తేదీని కూడా ప్రకటించారు మేకర్స్. అక్టోబర్ 17న విడుదల కానున్నట్లు తెలిపారు.

## వావ్! సిద్ధూ మనసు ఎంత మంచిదో..

# యువకుడి హత్య ఘటనలో ఏడుగురు అరెస్ట్

**కాగజ్‌నగర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సబ్‌డివిజన్‌లో ఘర్షణతో ప్రారంభమైన గొడవ హత్యతో ముగిసిన సంఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జూన్ 3వ తేదీ సాయంత్రం కాగజ్‌నగర్‌లోని బాపు కాలనీలో సయ్యద్ దావూద్ అలీ అనే 19 ఏళ్ల యువకుడు స్నేహితులతో కలిసి ఖాళీ ప్రదేశంలో మద్యం సేవిస్తుండగా, అదే ప్రాంతంలో ఉన్న మరో యువకుల సమూహం పాత కక్షల నేపథ్యంలో దాడికి దిగింది. మాటల తూటాలు దాడికి దారి తీస్తుండగా, బీరు సీసాలు, రాళ్లు, స్టీల్ కడియం వంటి డ దావూద్‌పై విచక్షణ లేకుండా దాడి చేసి హత్య చేశారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు




చేపట్టారు. హత్య అనంతరం నిందితుల్కెన ఏడుగురు యువకులు హైదరాబాద్‌కు పారిపోవడానికి ప్రయత్నించగా, జూన్ 4న మధ్యాహ్నం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రక్తపు మరకలతో ఉన్న షర్టులు, దాడిలో ఉపయోగించిన స్టీల్ కడియం, బీరు సీసాలు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. మృతుడు సయ్యద్ దావూద్ అలీ కూలీగా పని చేస్తూ ఇందిరా మార్కెట్ ప్రాంతంలో నివసించేవాడు. అతడి మీద ఇప్పటికే 11 కేసులు నమోదవగా, ప్రధాన నిందితుడు షేక్ అక్బర్‌పై గతంలో 14 క్రిమినల్ కేసులు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. హత్యకు పాల్పడిన వారిలో షేక్ అక్బర్ (24), షేక్ జమీర్ (22), గిరిగులా రాజేశ్ (24), షేక్ అమీర్ (19), దుర్వే రాఘవేంద్ర (17), గోగర్ల రూపేశ్ (20), షేక్ రేయాన్ (16) ఉన్నారు. ఈ ఘటన కాఘజ్‌నగర్ పట్టణాన్ని ఉలిక్కిపడేసింది. పోలీసులు ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. పాత కక్షలే హత్యకు కారణమై ఉండొచ్చన్న కోణంలో విచారణ కొనసాగుతోంది.



## వెదురు తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌లు పట్టివేత

**జన్నారం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

జన్నారం అటవీ డివిజన్ పరిధి నుంచి మంగళవారం రాత్రి వెదురు తరలిస్తున్న రెండు ఐచర్ వ్యాన్‌లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం ఇస్లాంపూర్ నుంచి వెదురు లోడ్‌తో రెండు వ్యాన్‌లు వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఆర్వో మమత, బీట్ అధికారులు లాలుబాయి, తిరుమలేశ్ కిష్టాపూర్ సమీపంలో తనిఖీలు చేపట్టి ఐచర్ వ్యాన్‌లను పట్టుకుని జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా తాము అన్ని అనుమతులు తీసుకున్నామని డ్రైవర్ శేఖర్ తెలపడంతో అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

## ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

**చింతలమానేపల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**



ఉరేసు కుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపిన వివరాల మేరకు డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె శివకృష్ణ (36) మంచిర్యాల జిల్లాలో సింగ రేణి ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతని భార్య స్నేహతో తరచుగా గొడవలు జరుగుతుండేవి పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినప్పటికీ గొడవలు సద్దుమణగకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఒంటరితనంతో యువకుడు..

**సిర్పూర్ (టి), జూన్ 4 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని గొల్లవాడ కాలనీకి చెందిన బండి శ్రావణ్ (32) అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బండి శ్రావణ్ తల్లిదండ్రులు గతంలో మృతి చెందగా.. కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా ఉంటున్నాడు. సెంట్రింగ్ పని చేస్తూ.. జీవిస్తున్నాడు. ఒంటరితనం భరించలేకనే ఆత్మహత్యకు పాల ్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టుమీద పడి ఒకరు..

**దండేపల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**



చింతచెట్టును రంపం మిషన్‌తో కోస్తుంతోడగా ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి కూలీ మృతి చెందిన ఘటన దండేపల్లి మండలం కన్నెపల్లిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లికి చెందిన ఇండ్ల ఆశయ్య (65) గ్రామంలోని ఓ ఇంటి పెరటిలో గల చింత చెట్టును మరో ఇద్దరు కూలీలతో కలిసి రంపం మిషన్‌తో కోస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా చెట్టు విరిగి ప్రమాదవశాత్తు ఆశయ్యపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఆశల జీవితం.. ఆదిలోనే అంతం

- కన్నవారికి కడుపు కోత - మంచిర్యాలలో విషాదం
- ఏసీసీ క్వారీ మడుగులో పడి విద్యార్థి మృతి

**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాద ఘటన జరిగింది. జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీలో స్నేహితులతో కలిసి సరదాగా గడుపుదామని వెళ్లిన పట్టణంలోని జాఫర్‌నగర్‌కు చెందిన సాధుల హర్షవర్ధన్ (15) స్నానం కోసం వెళ్లి క్వారీ మడుగులోకి దిగి మునిగి ఊపిరాడక మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం సాయివర్ధన్ స్నేహితులతో కలసి మడుగులోకి దిగాడు. దిగినవారందరూ బయటకు రాగా సాయివర్ధన్ లోతులోకి వెళ్లడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు అక్కడినుంచి వారివారి ఇంటికి వెళ్లిపోయారు. మృతుడి తండ్రి ప్రసాద్ కొడుకు రాత్రి 8 దాటిన ఇంకా ఇంటికి రాకపోవడంతో స్నేహితుల వద్ద ఆరా తీయగా రాత్రి 10 గంటలకు క్వారీ వద్ద స్కూటీ, మడుగు పక్కన బట్టలు, చెప్పులు కనిపించాయి. తండ్రి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు బుధవారం ఘటన



స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పదో తరగతి పూర్తి చేసుకుని రేపు హైదరాబాద్‌లో ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ కోసం హాస్టల్‌కు వెళ్లే సమయంలో ఈ విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి, సాయి వర్ధన్ తండ్రి ప్రసాద్ పెద్దపల్లిలోని యాక్సిస్ బ్యాంకులో సేల్స్ మేనేజర్‌గా, తల్లి లావణ్య కోటపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు.

## అంబులెన్స్ ఆలస్యం గర్భిణీ మృతి

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**



అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ఎనిమిది నెలల గర్భిణీ గుండెపో మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సభ్యులు కుటుంబ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన గర్భిణీ కుర్సెంగ తారాబాయి (26)కి ఆదిలాబాద్ చింతలబోరికి చెందిన మాన్కుతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణీ. బుధవారం దంతనపల్లి పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంది. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వస్తుందని గంటల సేపు వేచిచూశారు. గంట ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రి వైద్యులు పరీక్షించి గుండెపోటుతో తారాబాయి మృతి చెందినట్లు తెలిపారు. 108 అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే గర్భిణీ బతికి ఉండేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నిండు గర్భిణి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.. అందరితో కలివిడిగా ఉండే తారాబాయి మృతి అందరిని కలిచివేసింది.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**లక్ష్మణచాంద, జూన్ 4 (ప్రభాత సమాచారం)**



హైదరాబాద్‌లో రైలు ఢీకొని మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. వడ్యాల్ గ్రామానికి చెందిన భీమన్న (55) గతంలో గ్రామంలో పశువుల కాపరిగా పని చేసేవాడు. ఆర్థిక ఇబ్బందులతో హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు బుధవారం పని కోసం వెళ్లే క్రమంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టింది.. తల, ముఖానికి తీవ్ర గాయాలైన భీమన్న అక్కడి కక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి ఆధార్ కార్డు సహాయంతో కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు, అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో గ్రామానికి చెందిన కొంత మంది యువకులు, ఇంటి చుట్టుపక్కల వారు విరాళాలు సేకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు.

## యువతి అదృశ్యం..

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని తండ్రి కలెక్టర్ చౌక్‌లోఉదయం వదిలిపెట్టి వెళ్లాడు. కళాశాలకు వెళ్లిన యువతి రాత్రి వరకూ తిరిగి రాలేదు. దీంతో యువతి తండ్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.



## వియత్నాంలో కాగజ్‌నగర్ యువకుడి దుర్మరణం

**కాగజ్‌నగర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన అర్విద్ అశ్రిత్ (21) బుధవారం వియత్నాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. మార్కెట్ ఏరియాలో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్న అర్జున్‌కు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వియత్నాంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వియత్నాంలోని తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి గోడను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అశ్రిత్ మరణ వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన వియత్నాం వెళ్లేందుకు బయలుదేరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**నర్సాపూర్ (జి), జూన్ 4 (ప్రభాత సమాచారం)**

మండలంలో మంగళవారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్సై సాయి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాసరకు చెందిన బాలాపురం లక్ష్మీనారాయణ రావు అనే యువకుడు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో యువకుడికి గాయాలు కాగా స్థానికులు 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

## గాడిదకు అరుదైన శస్త్రచికిత్స

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం అరుదైన ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన మీనాబాయికి చెందిన గాడిద ప్రసవ వేదనలో బాధపడుతుండడంతో తక్షణమే పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యులు గజానన్, దూద్‌రామ్ రాథోడ్, గోపి కిషన్ నిర్వహించిన సిజేరియన్ ఆపరేషన్‌లో జన్యులోపాలతో గల గాడిద పిల్ల జన్మించింది. ఇది పెద్ద తల, చిన్న శరీర భాగాలతో ఉండటంతో పుట్టిన కొద్ది నిమిషాలకే మృతి చెందింది. ఈ సాహసోపేత ఆపరేషన్‌లో సిబ్బంది సాజిద్ అలీ, అమీన్ ఖాజా పాషా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలబాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ఉపాధ్యాయులు బాలబాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ ప్రాధాన్యతను అందరికీ వివరించారు. ప్రపంచం వేగంగా మారుతోందని, ఎప్పటికప్పుడు ప్రజలను మోసం చేయడానికి, అమాయక బాల బాలికలను, యువతీ యువకులను వలలో వేసుకోవడానికి, వివిధ రకాలుగా వేధింపులకు గురి చేయడానికి, మోసం చేయడానికి నేరగాళ్లు రకరకాల మార్గాలను ఎంచుకుంటున్నారని, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ ట్రాఫికింగ్ తదితరాలు నేడు ఒక వ్యవస్థ పూరిత నేరాలుగా మారాయన్నారు. ఉన్నత స్థాయి నుంచి నిరక్షరాస్యుల వరకు ఎవరైనా వీటి బారిన పడవచ్చునని, అందుకే ఇలాంటి మోసాల నుంచి విద్యార్థులను రక్షించడం కోసం, చైతన్యవంతులను చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని ప్రజ్వల ఫౌండేషన్ సహకారంతో అందించ డం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు కేజీబీవీ, మోడల్ స్కూల్, యుఆర్ఎస్, టిఎస్ఆర్ఐఎస్ పాఠశాలల నుంచి ఇద్దరు చొప్పున హాజరైన ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్, కోర్స్ కోఆర్డినేటర్ యశోదర, క్వాలిటీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ శిక్షణ నిర్వాహకులు సిరాజ్, అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## బావిలో పడి మృతి చెందిన వ్యక్తి
# ఇస్తారిగా గుర్తించిన పోలీసులు

**బెజ్జూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలం బారెగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు చౌదరి ఇస్తారి (74) ప్రమాదవశాత్తు బావిలో పడిపోవడంతో మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరి ఇస్తారి భార్య పుల్లక్కకు మతిస్థిమితం లేకపోవడంతో ఆమెకు సంరక్షణగా ఆయన గత పదేళ్లుగా ఉన్నారు. కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం చౌదరి ఇస్తారి మహారాష్ట్రలోని చెప్రాల్ ఆధ్యాత్మిక కేంద్రానికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే మార్గమధ్యంలో ముంజంపల్లి గ్రామానికి సమీపంలోని ఒక ఫంక్షన్‌కు హాజరై అక్కడ మద్యం సేవించినట్లు తెలుస్తోంది. తర్వాత ఇంటికి తిరిగి వస్తుండగా, బారెగూడ శివారులో ఉన్న రైతు పాలె రామయ్య వ్యవసాయ భూమిలో గల బావిలో పడిపోయాడు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆ పొలాన్ని కౌలుకు తీసుకున్న జునగరి రాకేష్ అనే వ్యక్తి కూలీలతో కలిసి పనికి వెళ్లినప్పుడు, బావిలో ఓ మగ వ్యక్తి శవం తేలుతున్నట్లు గమనించాడు. వెంటనే యజమాని పాలె రామయ్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు వచ్చి చూసినప్పుడు అది చౌదరి ఇస్తారి శవమని గుర్తించారు. వెంటనే మృతుని సోదరుడు లస్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇస్తారి మరణంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

## భార్య రాదనే బెంగతో
# ఉరేసుకుని ఆత్మహత్య

**నర్సాపూర్ (జి), జూన్ 4(ప్రభాత సమాచారం)**



నర్సాపూర్(జి) మండలం లోని కుస్లీ గ్రామానికి చెందిన ఓ రైతు ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపి వివరాల ప్రకారం.. కుస్లీ గ్రామానికి చెందిన బొగడమీది గంగారాం (35) అనే యువ రైతు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 14 సంవత్సరాల క్రితం వెంకూర్ గ్రామానికి చెందిన మీనాతో వివాహమైంది. గత నెల క్రితం భార్యభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక తన భార్య రాదేమోననే బెంగతో జీవితంపై విరక్తి చెందిన గంగారాం మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి బొగడమీది గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## భార్యతో గొడవ.. భర్త అదృశ్యం

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని శ్రీరామ్ కాలనీకి చెందిన భోజన్న అనే వ్యక్తి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 27న ఇంట్లో భార్య దాసరి విజయతో గొడవ చోటుచేసుకుంది. దీంతో ఆయన భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. 29వ తేదీన భోజన్న కనిపించకుండా పోయాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమైన ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని, బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాధాన్యత గల ప్రాంతాల్లో డ్రైనేజీలు పూర్తిగా శుభ్రపరచాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలనీ ఆదేశించారు.గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పునః ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు, బడి బాట కార్యక్రమం, చిన్న మరమ్మతులు, యూనిఫాం కుట్టింపు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సిఈఓ గోవింద్, డీఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ రామారావు, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను
# త్వరగా పరిష్కరించాలి

### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

**ముథోల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వాటి పరిష్కారానికి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ సూచనలు చేశారు. అలాగే భరోసా కేంద్రంలో కుటుంబ కలహాలకు సంబంధించి కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ ఇప్పించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, మల్లేశ్, డీఎస్పీ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, ఎస్సైలు శ్రీనివాస్, శంకర్, ఎస్సై పెర్సిస్, క్యాంప్ ఇంచార్జీ రఘువీర్ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతి పత్రం అందించారు. డ్రైనేజీలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని, విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, కొన్ని వీధుల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లోనే రాత్రుళ్లు గడపాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్ వర్ధన్, జోగుల శ్రీదేవి, కర్రె లచ్చన్న, గాజుల ప్రభాకర్, రాజబాబు, నాగుల రాజన్న, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, విజయ్, వెంకన్న, దుర్గా ప్రసాద్, రవీందర్, శివ, బింగి సత్యనారాయణ, పవన్ పాల్గొన్నారు.

## నిషేధిత కలుపు
# మందు పట్టివేత

**నార్నూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్రలోని జివితి గ్రామం నుంచి అక్రమంగా తీసుకొస్తున్న నిషేధిత కలుపు మందు (రౌండప్)ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జీవన్‌రెడ్డి, ఏవో వెంకన్నలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు మహారాష్ట్రలోని జివితి ప్రాంతం నుంచి నిషేధిత కలుపు మందు నాలుగు కాటన్‌లో మొత్తం 32 బాటిళ్లు తరలిస్తుండగా, గాదిగూడ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేస్తామన్నారు.

## రైతులపై పోలీసుల
# దాడులు దురదృష్టకరం

### బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాన్సన్ నాయక్

**ఖానాపూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**



రైతులపై పోలీసుల దాడులు దురదృష్టకరమని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ మం దలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో భూ సమస్యను తెలిపేందుకు వచ్చిన వృద్ధ రైతుపై ఏఎస్ఐ దురుసుగా ప్రవర్తించడం బాధను కలిగిం చిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఐపీఎల్ బెట్టింగ్.. ముగ్గురిపై కేసు

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ఐపీఎల్ మ్యాచ్‌ను చూస్తూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడు తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. మంగళవారం ఐపీఎల్ మ్యాచ్‌లో పట్టణంలోని కల్వనబార్‌లో పనిచేసే నిఖిల్ రెడ్డి ఆన్‌లైన్‌లో రూ.4,500 బెట్టింగ్ పెట్టాడు. బట్టిసావర్గాంకు చెందిన ముస్తాల సాయిమహేశ్, వెంకట్లు వరుసగా రూ.2, 200, రూ.1,400 ఆన్‌లైన్ బెట్టింగ్ చేయగా పట్టుకుని వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

# రిమ్స్ చికిత్సలో పొందుతూ యువతి మృతి

మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా సుంగగూడకు చెందిన గంగాసాగర్ (20) అనే యువతి రిమ్స్ లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంట్లో ఉండి ఏ పనులు చేయకపోవడంతో తండ్రి మందలించ గా మనస్తాపానికి గురైన యువతి పురుగుల మం దు తాగింది. చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడండి

- ప్లాస్టిక్‌తో పర్యావరణానికి విఘాతం
- మైక్రో ప్లాస్టిక్, నీరు, ఆహారం ద్వారా మానవ శరీర భాగాల్లోకి ప్రవేశం.. క్యాన్సర్‌కు కారకం?
- జీవగ్రహాన్ని అతలాకుతలం చేస్తున్న సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్

## నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

జీవరాశులకు పరిసరాలకు మధ్యగల సం బంధమే పర్యావరణం... మన చుట్టూ ఉన్న వృక్ష సంపద, జంతువులు, సూక్ష్మజీవులు, నేల, నీరు, గాలి ఇవన్నీ పర్యావరణంలో భాగాలే. భూగోళం పై నివసిస్తున్న అన్ని జీవులతో మానవునికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉంది. జీవితంలో మనిషికి ఎన్నో అవసరాలు ఉన్నాయి. పీల్చే గాలి, తాగే నీరు, ఆశ్రయానికి గూడు, ఆహారం ప్రతిదీ ప్రకృతి సంపదే. ఏవి లేకుండా మనిషి జీవించలేడు. ఇలా మానవునికి, పర్యావరణానికి అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ప్రాథమిక అవసరాలకై ప్రకృతిపై ఆధారపడి జీవించాడు. క్రమక్రమంగా విచక్షణ రహితంగా ప్రవర్తించడం వలన సమతుల్యత భంగపడి పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యింది. ఈ పాపానికి కారణం కేవలం నేటి ఆధునిక మానవుడే.

### జూన్ 5 ఇలా ప్రారంభమైంది...

ఐక్యరాజ్యసమితి 1970లో పర్యావరణ రక్షణకై నైరోబీలో అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ప్రారంభించింది. 1972లో స్టాక్ హెూమ్‌లో జరిగిన ఫస్ట్ ఎర్త్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ జూన్ 5న మానవ పర్యావరణం అంశం చర్చల ఫలితంగా భారత ప్రభుత్వం 1986లో పర్యావరణ రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా పర్యావరణాన్ని రక్షించడం, కాలుష్యాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం అధికారం ఇచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1990లో పర్యావరణ పరిరక్షణ సంవత్సరంగా ప్రకటించింది. ప్రపంచంలోనే ప్రప్రథమంగా మనదేశంలో పర్యావర ణ న్యాయ స్థానాలనుఏర్పాటు చేసి నేరస్తులను క ఠినంగ శిక్షించుటకు అప్పటి కేంద్ర పర్యావరణ శాఖ మాత్యులు మేనకా గాంధీ నిశ్చయించారు.

### సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ మానేసే దిశగా ముందడుగులు పడాలి...

ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమ స్య పర్యావరణ సంక్షోభం. పర్యావరణ కాలు ష్యం అణుబాంబు విస్ఫోటనం కన్నా అతి ప్రమాదకరమైనది. ఇది మానవునితో పాటు కోటానుకోట్ల జీవ జాతులు జీవించే హక్కు ను హరించి వేస్తుంది. పర్యావరణంలో మ మేకమై జీవనం సాగించాల్సిన మానవుడు క్రమక్రమంగా ఇతర జీవుల ఉనికి పెను ప్రమాదాన్ని కలిగించే విధ్వంస పోకడలకు తెగబడటమే పర్యావరణ కాలుష్యానికి మూల కారణం. ప్రధానంగా సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ ను ఆపకపోతే మన ముందు పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. పర్యావరణ కాలుష్యం యావత్ ప్రపంచ సమస్యగా భావించి కోపెన్ హగ్ పర్యావరణ రక్షణ పై సదస్సు జరిపి ఐక్యరాజ్యసమితిలో ఆమోదింపజేసి పలు తీర్మానాలు చేయడం జరిగింది. చట్టాలు ఎన్ని చేసినప్పటికీ వాటిని నిబద్ధతతో అమలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వలన ఫలితం శూన్యం.

### పర్యావరణ మిత్ర అలవాట్లు ఇలా..

ప్రతి వ్యక్తి తనపుట్టిన రోజుతో పాటు అన్ని శుభకార్యాలు, వివిధ సందర్భాలలో మొక్కలు నాటి సంరక్షించాలి. సహజ వనరులు ఇంధనాలను పొదుపుగా వాడుకోవాలి. మొదలు పర్యావరణ మిత్ర వస్తువులు ఉపయోగించాలి. అడవులను వన్య జీవులను సంరక్షించుకోవాలి. దూరప్రయాణాలు వ్యక్తిగత వాహనాలకు బదులు పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్‌ను వినియోగించాలి. కాలుష్యాన్ని నివారించి గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టాలి. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి. అన్ని జీవులను ప్రేమి స్తూ కాపాడాలి జీవవైవిధ్యాన్ని కాపాడాలి. ప్రజల్లో, విద్యార్థుల్లో, యువతలో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం ఇచ్చిన సంస్థ కృషి చేయాలి. పర్యావరణ చట్టాలను అందించిన వారిని కఠినంగా శిక్షించాలి.

### అవసరాల మేరకే వాడుకోవాలి...

వనరులను అవసరాల మేరకే చాలా పొదుపుగా ఉపయోగించుకుంటూ పరిరక్షించాలి. పరిరక్షణను విస్మరించడం వలన ఎన్నో ఉపద్రవాలు, సమస్యలు మానవాళిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ముందుచూపు లేని మానవ చర్యలు పర్యావరణ వినాశ నానికి కారణం అవుతున్నాయి. మితిమీరిన స్వార్థపూరిత కోరికలను మానుకొని ప్రకృతి సంపదను, సహజ వనరులను, పర్యావరణ ఫలాలను భారత రాజ్యాంగంలోని 51 ఆర్టికల్ ప్రకారం,1986 భారత పర్యావరణ చట్టం ప్రకారం అవసరమైనంత మాత్ర మే వాడుకుని ఇతరులకు భావితరాలకు మానవ దర్పంగా పొదుపు చేయాలి. పర్యావరణానికి మిత్రులుగా మారి మనుగడ సాగిస్తేనే రేపటికి భావితరాలు అనేవి ఉంటాయి. సంరక్షణ చర్యలు చేపట్టకుండా పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది.

- న్యూస్ డెస్క్, ప్రభాత సమాచారం





# చెడు కొలెస్ట్రాల్ తగ్గించుకోండిలా..!

**ప్రభాత సమాచారం, హెల్త్ డెస్క్**

**మనం తీసుకునే ఆహారాల వల్లే శరీరంలో మంచి, చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంటాయి. మంచి కొవ్వు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందుతాయని.. చెడు కొలెస్ట్రాల్ వల్ల అర్థరైటిస్, గుండె జబ్బుల ముప్పు పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆరోగ్యంగా ఉండాలంటే దీనిని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఈ ఆహార పదార్థాలను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.**





» ఓట్స్, చిరుధాన్యాలు, నట్స్, బార్లీని ఆహారంలో చేర్చుకొంటే చెడు కొలెస్ట్రాల్ సమస్య దరి చేరదని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉండే బెటా గ్లూకాన్ శరీరంలో పేరుకొన్న చెడు కొలెస్ట్రాల్‌ను పోగొడుతుందని వెల్లడిస్తున్నారు. ఉదయం అల్పాహారంగా ఓట్స్‌తో చేసే పదార్థాలను పండ్ల ముక్కలతో కలిపి తీసుకొంటే మంచిదని సూచిస్తున్నారు. అలాగే ప్రొటీన్లు, పీచు పుష్కలంగా ఉండే బీన్స్, బఠాణీలు, రాజ్మాతో చేసే వంటకాలు రక్తపోటును అదుపులో ఉంచుతాయని వివరిస్తున్నారు. హృద్రోగానికి కారణమయ్యే కొలెస్ట్రాల్‌గా మారే చెడు కొవ్వును తగ్గిస్తాయని అంటున్నారు. ఇంకా పీచు, ఖనిజలవణాలు పుష్కలంగా ఉండే గింజ ధాన్యాలు, శనగలు, బాదం, వేరుశనగ, అక్రోట్లు రోజూ ఆహారంలో ఉండేలా జాగ్రత్తపడాలని తెలిపారు. వీటితో శరీరానికి మంచి కొలెస్ట్రాల్ అందుతుందని పేర్కొన్నారు.

**పండ్లు :** యాపిల్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలతోపాటు అవకాడో, నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లలో మెండుగా ఉండే పెక్టిన్.. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని తెలిపారు. ఇంకా సోయా పాలను అల్పాహారంతో కలిపి తీసుకొంటే ఈ సమస్యకు దూరంగా ఉండొచ్చని వెల్లడిస్తున్నారు. బ్లూబెర్రీస్, అరటి, స్ట్రాబెర్రీస్‌లోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని కొవ్వును పెరగకుండా సమన్వయం చేస్తాయని వివరిస్తున్నారు. ఇందులో పీచుతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ



ఇన్‌ఫ్లమెటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయని.. ఇవి రక్తసరఫరాను మెరుగ్గా ఉంచుతాయని చెబుతున్నారు. ఫలితంగా కొలెస్ట్రాల్ పేరుకోకుండా కాపాడి హృద్రోగాలు, బ్రెయిన్ స్ట్రోక్స్ రాకుండా పరిరక్షిస్తాయని వెల్లడిస్తున్నారు.

**చేపలు :** చేపల్లో పుష్కలంగా ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ రక్తంలో గడ్డలు ఏర్పడకుండా చేయడమే కాకుండా కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయని తెలిపారు. అందుకే వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు చేపలు తినాలని సూచిస్తున్నారు. ఇంకా కనోలా నూనె, అవిసెగింజలు, వాల్‌నట్స్ వంటివీ చెడు కొలెస్ట్రాల్‌ను దరిచేరనివ్వని అంటున్నారు. దీంతో పాటు వంటల్లో వెజిటబుల్ ఆయిల్స్ వినియోగం మంచిదని వివరిస్తున్నారు.



**వెల్లుల్లి :**



» ఇందులో ఉండే అల్లిసిన్ అనే రసాయనం చెడు కొలెస్ట్రాల్‌ను పెరగకుండా నియంత్రిస్తుందని అంటున్నారు. ఇంకా శరీరంలో అనవసరంగా పేరుకుపోయే కొవ్వును ఇది కరిస్తుందని.. ఫలితంగా హృద్రోగాలకూ దూరంగా ఉండొచ్చని చెబుతున్నారు. రోజూ పరగడుపున రెండు వెల్లుల్లి రెబ్బలను నమిలి మింగితే ఎన్నో ప్రయోజనాలు అందుతాయని వెల్లడిస్తున్నారు.

» "తాజా పండ్లు, కూరగాయలు, ఓట్స్ లో పీచు అధికంగా ఉంటుంది. ఇవి ఆహారం ద్వారా వెళ్లే కొవ్వు శరీరంలోకి చేరి పేరుకు పోకుండా ఉంటుంది. సోయాలో ఉండే గుణాలు చెడు కొలెస్ట్రాల్ను తగ్గిస్తాయి. పప్పులు, చిక్కుళ్లు తీసుకోవడం ద్వారా నీటిలో కరిగే పీచును ఎక్కువగా పొందవచ్చు. ఇది రక్తంలో కొవ్వును బయటకు తీసుకువచ్చేలా చేస్తుంది."

– **డాక్టర్ మధులిక ఆరుట్ల,**
పోషకాహార నిపుణులు

# ఎన్నికల తేదీపై ఉత్కంఠ

- నేడు ఓరియంట్ గుర్తింపు సంఘం ఎలక్షన్స్‌పై సమావేశం
- గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై చర్చ
- మళ్లీ వాయిదా పడుతుందేమోనని కార్మికుల్లో ఆందోళన
- దేవాపూర్‌లో తారా స్థాయికి చేరిన ఎన్నికల వేడి
- అభ్యర్థులంతా అధికార పార్టీకి చెందిన వారే..
- రెండుగా చీలిన ఆదివాసీ సంఘాలు




**బెల్లంపల్లి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్(అదానీ) కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై గురువారం ఆదిలాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆధ్వర్యంలో సమావేశం జరగనున్నది. కొన్ని నెలల క్రితమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఓరియంట్ సిమెం ట్ కంపెనీని అదానీ గ్రూపు కొనుగోలు చేసింది. ఇన్నాళ్లు యాజమాన్యం మార్పు కొనసాగగా.. ఎన్నికలు వాయిదా వేశారు. ప్రస్తుతం ఆ పక్రియ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలతో కార్మిక శాఖ ఎన్నికల కోసం కసరత్తు ప్రారంభించింది. కార్మిక సంఘాల నాయకులు జూన్ 5న ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని సమాచారాన్ని అందించారు. మెజార్టీ యూనియన్ల అభిప్రాయం మేరకు ఎన్నికలపై తుది నిర్ణయం వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తుంది. ఐదు యూనియన్లు పోటీ చేయడానికి అర్హత కలిగి ఉన్నాయి. ఎన్నికల తేదీలను ప్రకటిస్తారా లేదా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. గుర్తులు కేటాయించి, 266 మంది కార్మికుల ఓట్లపై చర్చించి.. ఓటర్ లిస్టును ఫైనల్ చేసి, ఎన్నికల తేదీని వాయిదా వేసే అవకాశం కూడా లేకపోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తారా స్థాయికి ఎన్నికల వేడి..**

దేవాపూర్‌లో ఓరియంట్(అదానీ) గుర్తింపు సంఘం ఎన్నికల వేడి తారా స్థాయికి చేరింది. బరిలో నిలిచేవారంతా కాంగ్రెస్ వారే కావడంతో.. ఆ పార్టీలో వర్గపోరు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావుకు కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్లు ముగ్గురు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు ప్రకటించారు. ఇదిలా ఉండగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు సోదరుడు కొక్కిరాల సత్యపాల్ రావు పోటీకి దిగుతున్నారు. సత్యపాల్‌రావు పార్టీలకు అతీతంగా పోటీ చేస్తానని ప్రకటించినప్పటికీ.. ఇక్కడ ఓ వర్గం సత్యపాల్‌రావుకు, మరో వర్గం విక్రంరావుకు మద్దతు ఇస్తున్నారు. అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ, గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు రాములు నాయక్ సైతం పోటీలో ఉంటున్నారు. వీరంతా కాంగ్రెస్ వారే కావడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

**రెండు వర్గాలుగా చీలిన ఆదివాసీ సంఘాలు...**

యూనియన్ ఎన్నికల కారణంగా ఆదివాసీ సంఘాలు నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. గతంలో ఏ సమస్య ఉన్నా.. కలిసికట్టుగా చర్చించి నిర్ణయం తీసుకునే సంఘాల నాయకులు ఇప్పుడు విడిపోయి బహిరంగంగా విమర్శలు చేసుకుంటున్నారు. ఓ వర్గం సత్యపాల్‌రావుకు, మరో వర్గం విక్రంరావుకు మద్దతు ఇస్తున్నారు. సుమారు 130 ఓట్లు ఆదివాసీలవే ఉంటాయని నాయకులు తెలిపారు.

## జీవో 49తో ఆదివాసీలకు

# తీవ్ర అన్యాయం

### మంత్రి సీతక్కకు మాజీ ఎంపీ సోయం వినతి

**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జి.ఓ 49తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఆదివాసీ నేతలతో కలిసి హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్కని కలిసి జీవో 49పై వినతిపత్రం అందజేసి, జీవో వల్ల కలిగే నష్టాలను ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. 49 జీవోతో అడవులను నమ్ముకొని బతికే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. పక్కన ఉన్న మహారాష్ట్ర నుండి ఏనుగులు, పులులు వస్తున్నాయని, వాటి సంరక్షణ సాకుతో ఆదివాసీలను అడవికి దూరం చెయ్యాలనే కుట్రలు జరుగు తోందన్నారు. పులులకు, ఏనుగులకు రక్షణ ఇచ్చే అటవీ అధికారులు మనుషులకు రక్షణ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 49 వల్ల ఆదివాసులను వారి వ్యవసాయ భూములను సాగుచేయకుండా, టైగర్ జోన్ల, కంజర్వేషన్, రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ప్రాంతాల పేరుతో సిర్పూర్, కాగజ్ నగర్ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో దాదాపు 250 గ్రామాల్లోని ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో మంత్రి సీతక్క స్పందిస్తూ జీవో 49తో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమనఖాండను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికీ తీసుకువెళతాను మంత్రి సీతక్క హామీ ఇచ్చారన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి - కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి**



**జైనూర్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. మండంలోని లేండిగూడ, గౌరి కొలాంగూడ రాకపోకలు చేసే రోడ్డు మార్గంలో ఉన్న లో లేవల్ వంతెన, మండల కేంద్రంలో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను ఆదనపు కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్ అందుబాటులో ఉంచుకోవాలని, రానున్న వర్షాకాలంలో పారిశుధ్య పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అధిక వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు క్లోరినేషన్ కార్యక్రమంపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసేలా కిందిస్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మొదటి మార్క్అవుట్ ఈ నెల 9లోగా పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల కుటుంబ వివరాలు జన్‌మన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో గర్భిణుల వివరాలను సేకరించి వారికి వర్షాకా లంలో ఇబ్బంది కలగ కుండా తగిన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు ఉపయో గకరమైన పనులు చేప ట్టాలని, భూగర్భ జల శాతాన్ని పెంచేలా కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో హరితహారం కింద లక్షలాది మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్ర మంలో మండల ప్రత్యేక అధికారి జాధవ్ గున్వంత్‌రావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగా ఆనంద్‌రావ్, ఏపీవో నగేష్, ఈసీ అంకుష్ పాల్గొన్నారు.





## బాధ్యులపై చర్యలు తప్పవు

**కౌటాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
కూలీల మేలు కోసం చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడ తప్పిదా లు జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని డీఆర్డీవో దత్తారాం హెచ్చరించారు. బుధవారం కౌటాల మండల కేంద్రం లోని రైతు వేదికలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి మధ్య కాలంలో జరిగిన రూ. 7.5 కోట్ల పనులకు సంబంధించిన ఆడిట్ ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయ న్నారు. ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా చేయాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. అదే సమయంలో రైతులు, ప్రజలు ఉపాధి హామీ కింద చేసే అభివృద్ధి పనులు చెరిపేయడం, తొలగించడం చేసేటప్పుడు ఖచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. దీని వల్ల ఆడిట్ సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకు అవసరమైన అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. చిన్న చిన్న తప్పిదాలు మినహా ఈ ఆడిట్‌లో బయట పడకపోవడం మంచి విషయమని, చిన్నవాటిని సైతం మళ్లీ జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ బృందం ఎస్ఆర్పీ రవి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్, ప్లాంటేషన్ మేనేజర్ ఆంజనేయులు, కంట్రోల్ అధికారి రమేష్, ఎంపీడీఓ రమేష్, ఏపీఎం పూర్ణిమా, ఏపీఎం ముక్తేశ్వర్, ఈసీ సంతోష్, ఎంసీవో సాయి పాల్గొన్నారు.

# ఆకతాయిలు వేధిస్తే ఫిర్యాదు చేయండి



**కడెం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ అజయ్ అన్నారు. బుధవారం కడెంలోని బస్టాండ్‌లో నారీశక్తి కార్యక్ర మంలో భాగంగా మహిళలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆపద, అత్యవసర వేళ 100కు డయల్ చేసి పోలీసుల సాయం పొందాలని సూచించారు. ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులున్నారు. అలాగే ౖెబంలో అపరిచితులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై శంకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వాటోలి గ్రామంలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 నంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**మందమర్రి, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మొదటి వార్షికోత్సవ పాలన విజయోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం బి-1 క్వార్టర్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, యువజన, సేవాదళ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి, వేడుకలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు మంద తిరుమల్ రెడ్డి, పైడిమల్ల నర్సింగ్‌లు మాట్లాడుతూ... దివంగత మహానేత కాకా వెంకటస్వామి మనవడు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎంపీగా సంవత్సర కాలం పాలన గడిచిన సందర్భంగా సంబరాలు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎంపీగా గెలిచిన అనంతరం పార్లమెంట్ నియోజకవర్గానికి పెద్దకొడుకు లాగా ఉంటానని ఇచ్చిన హామీ మేరకు హామీని నిలబెట్టుకున్నారన్నారు. వంశీకృష్ణ ఎంపీగా విజయం సాధించిన అనంతరం సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పదివేల పెన్షన్ ఇవ్వాలని పోరాడి, పెన్షన్ ఫండ్ కు 144 కోట్లు అందేలా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్తయ్య, నర్సన్న, రాజు, ఇషాక్, శంకర్, లక్ష్మణ్, వెంకన్న, గణేష్, సంతోష్, విజయ్, సతీష్, వేణు, శ్రీనివాస్, అంజయ్య, రామకృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఎండి జావిద్ ఖాన్, మూడారపు శేఖర్, సురేందర్ పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పంచాయతీరాజ్, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరై కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని స్వంత భవనాలు లేని గ్రామపంచాయతీ కార్యాలయాలు, పురోగతిలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపుల వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలు పూర్తి అయిన మేరకు బిల్లులు సమర్పించాలని తెలిపారు. భవన నిర్మాణానికి భూమి గుర్తించని ప్రాంతాలలో త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని, షెడ్యూల్ తెగల జనాభా అధికంగా ఉన్న అటవీ ప్రాంతాలో భూమి అందుబాటులో లేనట్లయితే అటవీ భూమి అవసరమైన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీల వారిగా కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ రామ్మోహన్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎ.ఈ.ఈ.లు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను విరమించుకోవాలి




**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని అఖిలపక్షం నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నరేశ్, సీపీఐ ఎంఎల్ అధ్యక్షులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గాదె సత్యం, సీపీఐ కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయ కులు మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్ శక్తు లకు కట్టబెట్టడానికి కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటక ఎన్‌కౌంటర్‌కు పాల్పడుతు న్నార ని విమర్శించారు. 2026 సంవత్సరం నాటికి మావో యిస్టు పార్టీని పూర్తిగా లేకుండా చేయాలనే ల క్ష్యం తో మోదీ ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతోం ద న్నారు. ఈ బూటకు ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారని ఇప్పటికే సుమారు 500 మంది మావోయిస్టులు మృతి చెందారని, మావో యిస్టులతో పాటు అమాయక ఆదివాసీలను కూడ బలిగొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాన్ని అమలు చేస్తుందన్నారు. అదాని, అంబాని ధన దాహం కోసం బీజేపీ సర్కార్ ప్రజలను, ప్రజా నాయకులను చంపడం ఆ పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణు, బీఆర్ఎస్ నాయకులు కర్రె శంకర్, నాయకులు బలికొండ రమేశ్, సీపీఐ నాయకులు లక్ష్మణ్, చంద్ర శేఖర్, ఖలీందర్, న్యూడెమోక్రసీ నాయకులు లాల్‌కు మార్, మేకల రామన్న, జాడి దేవరాజ్, తుడుం దెబ్బ నాయకులు గంట సత్యం, టీపీఎఫ్ నాయకులు జైపా ల్‌సింగ్, ఏఐఎఫ్‌టీయు నాయకులు పోచమల్లు, దేవి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**





**జన్నారం, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధి దారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మించి ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అని గత ప్రభుత్వాలు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. మంజూరైనప్రతి పేద కుటుంబం ఇళ్లని ర్మించుకోవాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుడు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సూచించారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. మొదటి విడతగా నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతీ ఒక్కరి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మండల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న అటవీశాఖ చెక్ పోస్టలను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఏడీసీసీ బ్యాంక్ పొన్కల్ సింగిల్ విండో సోసైటీలో సభ్యులైన రైతు పంబాల నాగమల్లేశ్ పంటరుణం పొంది చనిపోయాడు. అతడి భార్య రాజేశ్వరికి ఏడీసీసీ బ్యాం క్ మేనేజర్ స్వాతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మంజూరైన రూ.2లక్షల చెక్కును అందజేశారు. అనంతరం పొనకల్ సింగిల్ విండో కార్యాలయంలో జీలుగా, వరి ధాన్యం విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ వైస్ చైర్మన్ పసియుల్లా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ , పిఏసిఎస్ చైర్మన్ అల్లం రవి, నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, మోహన్ రెడ్డి సుభాష్ రెడ్డి ఇసాక్, మామిడిపల్లి ఇందయ్య రమేష్, మచ్చ శంకరయ్య, కరుణాకర్ షాకీర్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సన్నబియ్యానికి సర్వర్ కష్టాలు

- బయోమెట్రిక్ ప'రేషన్'
- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- ఆరుసార్లు వేలిముద్ర.. పంపిణీలో జాప్యం



**ముథోల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

రేషన్ దుకాణాల పేరెత్తితో జనం విసిగిపోతున్నారు. సన్న బియ్యం కోసం గంటల తరబడి నిలబెడుతున్నారని మండిపడుతున్నారు. తెల్లవారగానే.. సంచులు పట్టుకుని బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొన్నదని భగ్గుమంటున్నారు. పనులు మానుకుని బియ్యం కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు వచ్చాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేందుకు అరగంట వరకు పట్టేదని, ఇప్పుడు గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తున్నదని ఆగ్రహంగా చెబుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా మూడుల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా లబ్ధిదారులకు అవసరమయ్యే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేసిన రేషన్ దుకాణాలకు పంపిణీ చేశారు. జిల్లాలో జూన్ 2నుంచి బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు. బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు రేషన్ దుకాణాల ఎదుట పడిగాపులు కాయాల్సి వస్తుంది. మూడు నెలల బియ్యం కోసం యంత్రంపై ఆరు సార్లు వేలిముద్ర ఉంచాల్సి వస్తుంది. దీంతో పంపిణీలో తీవ్రజాప్యం జరుగుతుండడంతో లబ్ధిదారులు దుకాణాల ఎదుట నిల్చోవాల్సి వస్తుంది. గత నెల వరకు కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున అందించేవారు. ఒకసారి వేలిముద్ర పెడితే సరిపోయేది. లబ్ధిదారులు 15 నిమిషాల్లో బియ్యం తీసుకుని పోయేవారు. ఇప్పుడు బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయం పడుతుంది.

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ
# డీవీ శ్రీనివాస్ రావు బదిలీ

**నూతన ఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్ నియామకం**

**ఆసిఫాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**





కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ రావును మెదక్ జిల్లా ఎస్పీగా నియమించారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకులు



**ఆదిలాబాద్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్‌ను ఉమ్మడి జిల్లా పీసీసీ పరిశీలకులు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల అబ్జర్వర్లుగా నియమితులైన వారు ఆయా జిల్లాల్లో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశాలకు సంబంధించి పార్టీ పరిస్థితులపై పూర్తి నివేదికలు ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్‌కు అందజేశారు.

# ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్

**నిర్మల్, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

డీఎస్సీ-2024లో నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందినందుకు రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ఓ ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్ జిల్లాకు చెందిన గైని సునీల్ కుమార్ డీఎస్సీ -2024లో ఎస్జీటీ ఉద్యోగం పొందాడు. సర్టిఫికె ట్ వెరిఫికేషన్ సమయంలో అతను నకిలీ పత్రాలు అందించి ఉద్యోగం పొందినట్లు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. రాష్ట్రంలోని ఇతర జి ల్లాల నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు అందడంతో విద్యాశాఖ అధికారులు క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. విచారణలో గైని సునీల్ అం దించిన స్పెషల్ ఎద్యుకేషన్ సర్టిఫికెట్ నకిలీదని తేలింది. దీంతో స్కూల్ ఎద్యుకేషనల్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఉపాధ్యాయుని అనర్హుడిగా ప్రకటించి షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా డీఈవో రామారావును ఆదేశించారు.




# ఏసీబీకి చిక్కిన సర్వేయర్ మంజుల

- వివరాలు వెల్లడించిన ఏసీబీ అధికారి విజయ్ కుమార్
- లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్, చైన్‌మెన్

**మంచిర్యాల, జూన్ 4 (ప్రభాత సమాచారం)**

రైతు వద్ద నుంచి లంచం తీసుకున్న మండల సర్వేయర్, చైన్‌మెన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన మంచిర్యాల తహసీల్ కార్యాలయంలో చోటు చేసుకుంది. మండల సర్వేయర్ మంజుల , చైన్ మెన్ ఉదయ భూ సర్వే కోసం బాధితుడికి రూ. 50 వేలు డిమాండ్ చేసి రూ. 30వేలకు ఒప్పందం చేసుకున్నారని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. ఇందులో రూ. 16,500లను ఫోన్ పే, మరో రూ. 10వేలను నగదుగా తీసుకున్నారు. మరో రూ.30 వేలు ఇస్తేనే భూమి సర్వే చేస్తామని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడని వివరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని, కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ వెల్లడించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY